
వార్త
ఆదివారం
21 ఆగస్టు, 2022
'స్వర్ణ' భారత్
BIRMINGHAM 2022
commonwealth sport
BIRMINGHAM 2022 commonwealth games
commonwealth sport
INDIA

# 'ఇండియన్ 2'లో కాజల్ అగర్వాల్!

పెళ్లి చేసుకుని బ్రేక్ తీసుకున్న కథానాయిక కాజల్ అగర్వాల్



మళ్లీ మేకప్ వేసుకోవడానికి రెడీ అవుతోంది. నేహా ధూపియాతో ఇన్‌స్టాగ్రామ్‌లో చాట్ సందర్భంగా ఈ విషయం వెల్లడించింది.

సెప్టెంబర్ నుంచి కమలహాసన్‌కు చెందిన 'ఇండియన్ 2' సినిమాతో షూటింగు మొదలుపెట్టనున్నట్లు ఆమె తెలిపింది. సెట్స్‌లో ప్రమాదం వల్ల ముగ్గురు టెక్నీషియన్లు మరణించడంతో రెండేళ్లుగా నిలిచిపోయిన శంకర్ సినిమా మళ్లీ మొదలు కానుందని కాజల్ సమాధానంతో తెలుస్తోంది.

కాజల్ అగర్వాల్ మళ్లీ సినిమాల్లో నటించనున్నట్టు ఆమె చేసిన ప్రకటన అభిమానులకు సంతోషాన్నిస్తోంది. 1996లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా రూపొందుతోంది 'ఇండియన్ 2'. ఈ సినిమా కొంత వరకు షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె ఓ బాబుకు జన్మనివ్వడం విదితమే.



# ఈ నెలాఖర్లో 'కోబ్రా' విడుదల



విక్రమ్ హీరోగా 'కోబ్రా' సినిమా రూపొందింది. రెడ్ జెయింట్ మూవీస్ బ్యానర్‌పై లలిత్ కుమార్ నిర్మించిన ఈ సినిమాకి అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించాడు. భారీ బడ్జెట్‌తో నిర్మితమైన ఈ సినిమాలో కథానాయికగా శ్రీనిధి శెట్టి అలరించనుంది. ఏఆర్ రెహ్మాన్ ఈ సినిమాకి సంగీతం సమకూర్చాడు.

ఈ సినిమా తమిళంతో పాటు తెలుగు, కన్నడ భాషల్లో ఈ నెలాఖరులో విడుదల కానుంది. విభిన్నమైన కథా కథనాలతో రూపొందించిన ఈ సినిమాపై విక్రమ్ గట్టిగానే ఆశలు పెట్టుకున్నాడు.

తాను కొంత కాలంగా వెయిట్ చేస్తున్న బ్లాక్ బస్టర్ ఈ సినిమాతో పడుతుందని ఆయన భావిస్తున్నాడు. ముఖ్యమైన పాత్రల్లో ఇర్ఫాన్ పఠాన్, మియా జార్జ్ కనిపించనున్నారు. ఈ సినిమా హిట్ అయితే తన పారితోషికం పెంచే ఆలోచనలో శ్రీనిధిశెట్టి ఉన్నట్టుగా వినికిడి.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
21 ఆగస్టు, 2022

## మంచి ముత్యాలు

పుస్తకం మౌనం వహించిన మహాకవి, ఒంటరితనాన్ని పోగొట్టే స్నేహితుడు, మరో ప్రపంచానికి తీసుకుపోయే ఇంద్రజాలికుడు.

\- మన్నవ గిరిధరరావు

## విషయ విశేషం

ఆకాశంలో హోటల్.. 4
'సంఘీ'భావం....5
హద్దులు దాటిన ఉచితాలు సరికాదు
మూడు జలపాతాల కలయికే నయాగర..6
కవర్ స్టోరీ..8
'స్వర్ణ' భారత్
పాలరాతిని తలపించే షోలాపిత్ చెక్కబొమ్మలు..14
ఈవారం కవిత్వం..18
అమ్మ కడుపులో..
కథ.. 20
ఊరిమట్టి
పైకొచ్చే టా 'లెంటు' .. 25
సాహిత్యం.. 27
నవ సమాజ చైతన్య భావోత్తేజం ..
చిత్రభారతి.. .30
తెలుగు సినిమాకు ఓ బంగారు దీపం.. 30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
కాసేపు సరదాగా నవ్వుకోండి
వగైరా..వగైరా..




# తాజా వార్తలు

## వర్షం వచ్చినా ఇబ్బందుండదు..



కారు, బస్సు లాంటి వాహనాలకు వుండే వైపర్లు వర్షా కాలంలో అద్దాలపైపడ్డ నీళ్లను తుడిచేస్తుంటాయి. హెల్మెట్ ధరించి టూ వీలర్ల మీద ప్రయాణించేప్పుడు వర్షాకాలంలో వర్షపు నీరు హెల్మెట్ మీద పడి దారి సరిగ్గా కనిపించదు. ఇప్పుడు ఆ సమస్య లేదిక. 'హెల్మెట్ క్లియర్ రెయిన్ ప్రూఫ్ ఫిల్మ్' మార్కెట్‌లో లభిస్తోంది. వాన చినుకులు హెల్మెట్ మీద పడినా దారి క్లియర్‌గా కనిపించేలా చేస్తుంది ఇది. ఫోన్ మీద స్క్రీన్‌గార్డ్ వేసుకున్నట్టు ఈ ఫిల్మ్‌ను హెల్మెట్ అద్దం మీద అతికించాలి. ఆ ఫిల్మ్ యాంటీఫాగ్, యాంటీవాటర్‌గా పని చేస్తూ నీటినీ, పొగమంచునీ దరి చేరనివ్వకుండా స్పష్టంగా కనిపించేలా చేస్తుంది. చిన్న వస్తువు అయినా ఈ ఫిల్మ్ ప్రమాదాలను నివారించడంలో ఎంతగానో ఉపయోగపడుతుంది.

## ఇష్టమైన డిజైన్ వేసుకోవచ్చు



విభిన్నంగా వుండే వస్తువులు చిన్నారులను బాగా ఆకర్షిస్తాయి. అందువల్ల పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లూ... ఇలా పిల్లలు ఉపయోగించే ప్రతి వస్తువులోనూ ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్లు వస్తుంటాయి. అలాంటి వాటిలో ఇప్పుడు విభిన్నమైన పెన్ ఒకటి వచ్చి చేరింది. దానిని 'డ్యూయల్ టిప్ మార్కర్స్ విత్ డిఫరెంట్ కర్వ్ షేప్స్ పెన్ ' అంటారు. ఈ పెన్నుతో ఒక వైపు నుంచి రాసుకోవచ్చు. ఇక విశేషం రెండో వైపుంది. మొదటి వైపు మామూలు 'ఫైన్ టిప్' వుంటుంది. రెండో వైపు ప్రత్యేకమైన 'రోలర్ పెన్ పాయింట్ మార్కర్ టిప్' ఉంటుంది. దీంతో రాస్తుంటే రంగు రంగుల్లో పూల గుర్తులు, వంపులు తిరిగిన గీతలు, చుక్కల గీతలు.. ఇలా రకరకాల డిజైన్లు వస్తుంటాయి. గ్రీటింగ్ కార్డుల్లో రాసుకోవడానికి, నోట్‌బుక్కుల్లో అండర్‌లైన్ చేసుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. సులభంగా ఇష్టమైన డిజైన్లు సైతం వేసుకోవచ్చు సుమా!





# ఆకాశంలో హోటల్

**సమీప** భవిష్యత్తులో రూపు దిద్దుకోనున్న ఎగిరే హోటల్ స్కై క్రూయిజ్ గ్రాఫిక్స్ నమూనా ఇది. విమానంలా ఎగిరే అనుభూతిని, విలాసవంతమైన ఓడలో లభించే సకల సౌకర్యాలను ప్రయాణికులకు ఒకే సమయంలో అందించగల బాహుబలి తరహా విమానమని చెప్పవచ్చు.

ఆకాశంలో ఏళ్ల తరబడి..

ఎంత భారీ విమానమైనా కొన్ని గంటల పాటు ప్రయాణించాక కిందకు దిగడం అనివార్యం. అలాగే ఆరు నెలల తరబడి సముద్రంపై ప్రయాణించే క్రూయిజ్ షిప్‌లు సైతం ఎక్కడో ఒకచోట లంగరు వేయక తప్పదు. కానీ యెమెన్‌కు చెందిన ప్రముఖ సైన్స్ ఇంజినీర్ హాషీమ్ అల్-ఘాయిలీ యూట్యూబ్‌లో స్కై క్రూయిజ్ పేరిట తాజాగా విడుదల చేసిన 'ఎగిరే హోటల్' కంప్యూటర్ గ్రాఫిక్స్ వీడియో నెటిజన్లను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తోంది. వేలాది మంది ప్రయాణికులతో ఆకాశంలో ఏళ్ల తరబడి నిరంతరాయంగా ఎగరగలగడం దీని ప్రత్యేకతల్లో ఒకటి. పూర్తిగా కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో ఎగిరే ఈ విమానంలో ఒకేసారి 5 వేల మంది అతిథులు ఆకాశయానం చేయొచ్చట. ఇంత భారీ విమానం గాల్లో ఎగిరేందుకు వీలుగా అణు ఇంధనంతో నడిచే 20 ఇంజిన్లను దీనికోసం డిజైన్ చేశారు. ఇందుకోసం ఏకంగా ఓ చిన్నపాటి అణు రియాక్టర్‌నే ఇందులో ఏర్పాటు చేయనున్నారు. నియంత్రిత స్థాయిలో కేంద్రక సంలీన ప్రక్రియ ద్వారా అపరిమిత ఇంధనాన్ని ఈ విమానానికి సమకూర్చనున్నారు. దీంతో ఈ విమానం ఎప్పటికీ నేలపై వాలాల్సిన అవసరం రాదని డిజైనర్



చెబుతున్నాడు.

మరి ప్రయాణికులు ఇందులోకి ఎక్కి ఎలా దిగగలరు? అనుకుంటున్నారా? ఈ నూతన డిజైన్ ప్రకారం ప్రయాణికులను లేదా నిత్యావసరాలను సాధారణ వాణిజ్య విమానాలు లేదా ప్రైవేటు జెట్‌ల ద్వారా స్కై క్రూయిజ్ చెంతకు చేర్చి ప్రత్యేకమైన లిఫ్ట్ ద్వారా ఈ ఎగిరే హోటల్‌లోకి చేరుస్తారట. విమానానికి అవసరమైన మరమ్మత్తులు సైతం గాల్లోనే నిర్వహించడం గమనార్హం.

**ప్రపంచమంతా గాల్లోనే....**

ఈ విమానంలో ఉండబోయే సౌకర్యాలు అన్నీ ఇన్నీ కావు. ఇందులో ఓ భారీ షాపింగ్ మాల్, రెస్టారెంట్లు, బార్లు, స్పోర్ట్స్ సెంటర్లు, ప్లే గ్రౌండ్లు, సినిమా హాళ్లు, స్విమ్మింగ్ పూల్స్, వెడ్డింగ్ హాల్స్, సమావేశ మందిరాలు ఉండేలా డిజైన్ చేశారు. ప్రత్యేకించి విమానం తోక భాగంలో ఉండే భారీ డెక్ నుంచి 360 డిగ్రీల కోణంలో పైనున్న అంతరిక్షాన్ని, దిగువనున్న యావత్ ప్రపంచాన్ని అతిథులు వీక్షించే ఏర్పాటు ఉండనుంది. విమానం మధ్య భాగం నుంచి లోపలకు వెలుతురు ప్రసరించేలా పూర్తిగా గ్లాస్ బాడీతో దీన్ని డిజైన్ చేయనున్నారు. విమానానికి ఇరు వైపులా ఏర్పాటు చేసే బాల్కనీల తరహా డోమ్‌ల నుంచి అతిథులు చుక్కలను చూసే ఏర్పాటు సైతం ఉంది. అలాగే దట్టమైన మేఘాల్లోంచి ప్రయాణించే సమయంలో విమానం కుదుపులు లేదా కంపనాలకు గురయ్యే అవకాశం ఉంటే దాన్ని కొన్ని నిమిషాల ముందే గుర్తించి వాటిని నివారించేలా యాంటీ వైబ్రేషన్ టెక్నాలజీ సైతం ఈ క్రూయిజ్ క్రాఫ్ట్‌లో ఉండనుంది.

అన్ని బాగానే ఉన్నాయికానీ ప్రయాణికులు రోజుల తరబడి గాల్లో ప్రయాణిస్తే జెట్ లాగ్ తరహా అనారోగ్యానికి గురైతే ఎలా? అందుకోసం ఈ విమానంలో ఒక అత్యాధునిక వైద్య కేంద్రాన్ని డిజైన్ చేశారు.



## 'సంఘీ' భావం



# హద్దులు దాటిన ఉచితాలు సరికాదు

ఎన్నికల సమయంలో విజయం సాధించేందుకు సుమారు రెండు దశాబ్దాలుగా ఉచితాల వరాలపై వివిధ రాజకీయ పార్టీలు ఆధారపడుతున్నాయి. వివిధ మార్గాల్లో ఉచితాలను ఓటర్లకు అందిస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొంటున్నాయి. నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలకు కొన్ని సందర్భాల్లో ఉచితంగా కొన్ని పథకాలు ప్రవేశపెట్టడంలో తప్పులేదు. అయితే అవి పరిధి దాటి ఒకే కుటుంబంలో నాలుగైదు రకాల ఉచితాలు, నగదు బదిలీలు వంటివి అమలుచేయడం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూరి అభివృద్ధి కార్యక్రమాలు, నిరంతరం కొనసాగే కొన్ని సేవలకు ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉంది. గత నాలుగైదు ఎన్నికల సమయంలో ప్రచార సరళిని పరిశీలిస్తే వివిధ పార్టీలు సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి వ్యూహాత్మక సరళిపై ఆధారపడుతున్నట్లు స్పష్టం అవుతోంది. దీనివల్ల సమగ్ర అభివృద్ధి నిలిచిపోయి తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది. ఇదే విధానం కొన్ని సంవత్సరాల పాటు కొనసాగితే ఆర్థిక సంక్షోభం తలెత్తుతుంది. ఏదైనా ఒక అంశం పరిధి దాటినప్పుడు దానిపై చర్చ సర్వసాధారణంగా తెరపైకి వస్తుంది. ప్రస్తుతం అటువంటి చర్చ ఎన్నికల ఉచితాలపై కొనసాగుతోంది.

ప్రధానమంత్రి నరేంద్రమోడి ఈ అంశంపై ప్రకటన చేస్తూ ఉచితాలు ఇవ్వడం సరికాదన్న తన అభిప్రాయాన్ని వెల్లడి చేశారు. దేశంలోని సర్వోత్తమ న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ కూడా ఇదే అభిప్రాయాన్ని ప్రకటించారు. ఉచితాలు ఇవ్వడం అన్నది సుమారు 5 దశాబ్దాల క్రితం నుంచే ప్రారంభమైంది. అది కాస్తా రెండు దశాబ్దాల నుంచి పరిధి దాటి విస్తరించింది. ఒకసారి అలవాటు అయిన పథకాలను, పద్ధతులను మార్చుకోవాలంటే ఎంతో సంఘర్షణకు దారితీస్తోంది. ప్రస్తుతం ఇదే జరుగుతోంది. కొందరు ఉచితాలు లేకపోతే ఎలా అని ప్రశ్నిస్తుంటే- మరికొందరు ఉచితాల వల్ల కలిగే అనర్థాలపై దృష్టి సారిస్తున్నారు. ఉచితాల విషయంలో పరస్పర విరుద్ధ ప్రకటనలు రాజకీయ నాయకులు చేస్తున్నారు, ఎవరి ఆలోచనలు వారికి ఉంటాయి. అందులో తప్పేమీ లేదు. అయితే అంతిమంగా అవి సమాజానికి మేలు చేసే విధంగా ఉండాలి. తమ పార్టీకి అనుకూలంగానో, ఏదో ఒక వర్గానికి మేలు చేసే విధంగానో ఉండటం వల్ల భవిష్యత్తులో ఆయా వర్గాలకు అన్యాయం జరిగినట్లు అవుతుంది. ముఖ్యంగా తమిళనాడులో ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు పోటీలు పడి ఉచితాలను ప్రకటిస్తారు. స్కూటీ బైకులు, మోటారుసైకిళ్లు, కుక్కర్లు, టివిలు, ఉచిత కేబుల్ కనెక్షన్లు, ఉచిత విద్యుత్, ల్యాప్‌టాప్‌లు, టాబ్‌లు, సైకిళ్లు, గ్రైండర్లు ఇలా ఎన్నో వస్తువులను ఉచితంగా ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో వివరిస్తున్నారు. ఎన్నికల్లో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు కూడా ఇదే వైఖరి అవలంబిస్తున్నాయి. దీనితో ఎన్నికల ప్రక్రియ పూర్తి అయిన వెంటనే భారీ మొత్తంలో ఈ ఉచితాలను అందించాల్సి వస్తుంది. ఖరీదైన వస్తువులు ప్రజలకు ఉచితంగా పంచడం వల్ల ఒక్కసారిగా ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతోంది. వివిధ పథకాల అమలుకు డబ్బు లేకపోవడంతో అవి కుంటుపడుతున్నాయి. ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత వ్యవసాయపరంగాను, పారిశ్రామికంగా, రవాణా పరంగా అనేక పనులు నిరంతరం చేపట్టాల్సి వస్తుంది. సాగునీరు, తాగునీరు కోసం ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంటుంది. అదేవిధంగా గతంలో నిర్మించిన వాటికి నిర్వహణ ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ఇక నిత్యావసర వస్తువులను నిరుపేదలకు అందించడం కోసం సబ్సిడీ ఇవ్వవలసి వస్తుంది. ఇవన్నీ తప్పనిసరి. ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఉపాధ్యాయులకు, వైద్య సిబ్బందికి ఏటా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటారు. ఇవన్నీ అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. ఆసుపత్రుల్లో మందులు ఉచితంగా అందిస్తారు. పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు. దుస్తులు అందిస్తారు. రైతులకు సబ్సిడీపై ఎరువులు, క్రిమిసంహారక మందులు ఇస్తుంటారు. ఇవన్నీ ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయి. ఇలాంటి పథకాలకు ఎంత డబ్బు ఖర్చు చేసినా దానికి తగిన ఫలితం ఉంటుంది. అదేవిధంగా రవాణా సౌకర్యం మెరుగుపరడానికి కొత్త కొత్త రహదారుల నిర్మాణం నిరంతరం జరుగుతూ ఉండాలి. ఉదాహరణకు హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఎన్నో ఫ్లైఓవర్లు, కొత్త రహదారులు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలు లేకపోతే జనజీవనం స్తంభించి పోతుంది. అదేవిధంగా నీటి సరఫరాలకు భారీ మొత్తంలో నిధులు ఖర్చు అవుతాయి, ఇది ప్రజలకు అందిస్తున్న సేవల్లో ఒక భాగంగా గుర్తించాలి. అలాగే మార్కెట్ యార్డుల నిర్మాణం, నిర్వహణ వంటివి కూడా ప్రభుత్వమే భరిస్తుంది. వివిధ పన్నుల రూపంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని ఇలాంటి ఖర్చులకు, పథకాలకు వినియోగించాల్సి ఉంటుంది. అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ప్రభుత్వాలు తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర పద్దుల నుంచి నిధులను మళ్లిస్తుంటాయి. దీనివల్ల ఆయా పథకాలు కుంటుపడతాయి. తెలంగాణలో నిరుపేదల కోసం 5 రూపాయలకు భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. ఆసుపత్రులు, బస్టాండ్ల సమీపంలో ఏర్పాటు చేసిన ఈ స్టాల్స్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

రైతులకు రాయితీపై ఎరువులు, క్రిమిసంహారక మందులు ఇవ్వడం వల్ల వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుంది. అయితే కొంత నగదును నేరుగా వారి ఖాతాలకు బదిలీ చేయడం వల్ల డబ్బు నిరుపయోగం అవుతోంది. ఉచితాలను పూర్తిగా ఎత్తివేయకుండా ఎక్కడ ఏది అవసరమో వాటికి ఉపయోగిస్తే మంచిది. ప్రభుత్వాలు ఉచితాలను పక్కన పెట్టి వ్యవస్థలు అభివృద్ధి చెందడానికి రాయితీలు, ఇతర ప్రయోజనకర పథకాలు అమలుచేస్తే ఆయా రాష్ట్రాలు, ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# మూడు జలపాతాల కలయికే నయాగర

**షేక్ అబ్దుల్ హాకీం జాని**

**కెనడా,** ఉత్తర అమెరికా మధ్యలో నెలకొని ఉన్న అతిపెద్ద జలపాతం నయాగర. అంటే రెండు దేశాల సరిహద్దుల మధ్య నయాగర జలపాతం నెలకొని ఉంది. జీవితంలో ఒక్కసారైనా దీన్ని తిలకించాలనుకునే ప్రకృతి ప్రేమికులు చాలా మంది ఉన్నారు. నయాగర మూడు జలపాతాల కలయిక. అమెరికన్ జలపాతం, బ్రైడల్ వెయిల్ జలపాతం.. ఈ రెండు కూడా అమెరికా వైపు న్యూయార్క్‌లో ఉన్నాయి. అమెరికన్ ఫాల్స్ అమెరికా వైపు గోట్ ద్వీపం ద్వారా విభజించగా, చిన్నదైన బ్రైడల్ వెయిల్ ఫాల్స్ కూడా అమెరికన్ ప్రాంతంలో ల్యూనా ద్వీపం ద్వారా విభజింపబడి ఉంది. గోట్ ద్వీపం నుండి వచ్చే నీరు అతి పెద్దదైన, గుర్రపు డెక్కలా కనిపించే హార్స్ షూ జలపాతంపై నుండి ఉరుముతూ, భీకర శబ్దం చేస్తూ కిందకు పడుతుంది. హార్స్ షూ జలపాతం మూడు జలపాతాల్లోకి పెద్దది కాగా బ్రైడల్ వెయిల్ జలపాతం చిన్నది. ఈ మూడు జలపాతాల కలయికను నయాగర జలపాతం అని పిలుస్తారు. ఈ మూడు జలపాతాల ఎత్తు, వెడల్పుల్లో తేడాలు ఉన్నాయి. అమెరికా జలపాతం 1,060 అడుగుల వెడల్పు కలిగి వుంటుంది. కుడి వైపున కెనడాలోని ఒంటారియోలో అతి పెద్దదైన హార్‌షూ జలపాతం ఉంటుంది. ఈ జలపాతం 2,600 అడుగుల వెడల్పు, 188 అడుగుల ఎత్తు నుండి నీరు జాలువారుతుంటే ఆ అందం శోభాయమానంగా ఉంటుంది. ప్రతి సెకన్‌కు ఆరు లక్షల గ్యాలన్ల నీరు కిందకు పడుతుంది. హార్‌షూ జలపాతం గుర్రపు డెక్క ఆకారంలో ఉంటుంది.




**విద్యుచ్ఛక్తి ఉత్పత్తి**

హైడ్రో ఎలక్ట్రిసిటీ పేరుతో ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుచ్ఛక్తితో లక్షలాది ఇళ్లకు విద్యుత్ అందిస్తున్నారు. ఈ ప్రపంచంలో హైడ్రో విద్యుచ్ఛక్తిని తొలిసారిగా ఉత్పత్తి చేసింది ఇక్కడే. ఈ విద్యుచ్ఛక్తి అటు ఉత్తర అమెరికా, ఇటు కెనడా దేశాలు వినియోగించుకుంటాయి. నయాగరలో ఇంత నీరు ఎక్కడ నుండి వస్తుంది అనే అనుమానం రావచ్చు. నయాగరలో పలు సరస్సుల నీరు విలీనమౌతుంది. అమెరికాలో నాలుగు అతి పెద్ద సరస్సులు ఉన్నాయి. అవి మిచిగన్ సరస్సు, హ్యూరన్, యారీ, సుపీరియర్. ఈ నాలుగు సరస్సుల నీరు ఒకచోట చేరి నయాగర నది ఏర్పడుతుంది. ఈ నయాగర నీరు ఒంటారియో సరస్సుకు చేరి చివరకు అట్లాంటిక్ మహాసముద్రంలో కలుస్తుంది. నీరు తక్కువగా ఉన్న సమయంలో సెకనుకు 24 లక్షల లీటర్ల నీరు నయాగరా జలపాతం పైనుండి పడుతుంది. జూన్ నుండి ఆగస్టు వరకు నీరు ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ఒక సెకనుకు 64 లక్షల లీటర్ల నీరు పైనుండి కిందకు పడుతుంది. నయాగర నీటి ప్రవాహాన్ని అదుపు చేసే ప్రక్రియ ఇక్కడి ప్రభుత్వం చేతుల్లో ఉంది. ఆ కారణంగా పర్యాటకులు అధికంగా ఉండే పగటి పూట నీటి ప్రవాహం అధికంగా ఉండేలా, రాత్రిపూట నీటి ప్రవాహం తక్కువగా ఉండేలా ఏర్పాటు చేశారు. ప్రవాస భారతీయులు ఈ జలపాతాన్ని ఉరుమే జలపాతం అని పిలుస్తుంటారు. నయాగర జలపాతం చేసే హోరుకు కొంత మంది భయపడతారంటే అతిశయోక్తి కాదు.

## పలు రకాల టిక్కెట్టు ధరలు

నయాగర తిలకించడానికి పలు రకాల ధరలతో టిక్కెట్లు అమ్ముతుంటారు. దీన్ని చూడటానికి మనం ఎక్కువ సౌకర్యాలు కోరుకుంటే టిక్కెట్టు ధర కూడా పెరుగుతుంది. బస్సు చార్జీలు, నయాగరలో లాంచీ ప్రయాణం ఇలా.. పలు రకాల వినోదాలు ఉంటాయి. వీటిలో ప్రయాణించాలంటే అధిక ధర చెల్లించక తప్పదు. మనం కోరుకున్నదాన్ని బట్టే టిక్కెట్టు ధర ఉంటుంది. నయాగర చూడటానికి టిక్కెట్టు కొన్న తరువాత చేతి మణికట్టుకు ఒక రిబ్బన్ కడతారు. ఇది ఉంటే నయాగర ప్రాంతంలో ఒక ద్వీపం నుండి మరో ద్వీపానికి వెళ్లేటప్పుడు ఏ బస్సు ఎక్కినా టిక్కెట్టు కొనాల్సిన అవసరం లేదు. ఎక్కువ దూరం నడవ వలసిన అవసరం కూడా ఉండదు. సమయం కలిసి వస్తుంది. అర్ధగంటపాటు లాంచిలో ప్రయాణించి నయాగర చేరువకు వెళ్లి చూడవచ్చు. అతి పెద్ద లాంచిలో జలపాతం సమీపానికి వెళ్లి చూస్తే వర్ణనాతీత అందాలతో కనిపిస్తుంది. లాంచిలో అతి సమీపానికి వెళ్లి ఈ భీకర జలపాతాన్ని తిలకించడం మరపురాని అనుభూతి అని చెప్పవచ్చు. ఇది సాహసంతో కూడిన విన్యాసం. నయాగరను చూసేటప్పుడు నీటి వేగానికి మనపై వర్షం పడినట్లు నీటి తుంపరలు పడి తడిసిడి ముద్ద చేస్తాయి. అందువల్ల దీన్ని తిలకించడానికి వెళ్లే ప్రతి సందర్శకుడికీ రెయిన్‌కోట్ ఇస్తారు. చాలా మంది పర్యాటకులు రెయిన్ కోట్‌ను పట్టించుకోకుండా ఆ నీటి జల్లుల్లో తడిసిపోయి, కేరింతలు కొడుతూ ఉల్లాసంగా గడుపుతారు. హెలికాప్టర్, విమానాలలో సైతం ఎక్కి అతి చేరువకు వెళ్లి నయాగరా అందాలను వీక్షించే సౌకర్యం ఉంది. అందుకు అదనపు ఖర్చు అవుతుంది. ఈ విధంగా అటు కెనడా, ఇటు ఉత్తర అమెరికా ప్రభుత్వాలకు పర్యాటకుల ద్వారా మంచి ఆదాయం వస్తుంది.

ఈ జలపాతానికి 12 వేల సంవత్సరాల చరిత్ర వున్నట్లు తెలుస్తోంది. దీనికి నయాగర పేరు రావడానికి కారణంపై భిన్నాభిప్రాయాలున్నాయి. బ్రూస్ ట్రిగ్గర్ అనే ఇరాకీ శాస్త్రజ్ఞుడి అభిప్రాయం ప్రకారం 17వ శతాబ్దానికి చెందిన ఫ్రెంచి మ్యాప్‌లో చూపించినట్లుగా ఈ ప్రాంతంలో నయాగరేగా అనే జాతికి చెందిన ప్రజలు నివసించేవారనీ, అందువల్ల ఈ జలపాతానికి ఈ పేరు వచ్చి వుండవచ్చని అతడి భావన. నయాగర జలపాతం అమెరికా నుండి ఒక రకంగా కనిపిస్తుంది. కెనడా నుండి మరోలా కనిపిస్తుంది. కెనడా వైపు నుండి నయాగర గుర్రపు డెక్క ఆకారంలో అద్భుతంగా కనిపిస్తుంది. ప్రముఖ రచయిత డికెన్స్ నయాగరను వర్ణిస్తూ ఇది ప్రకృతి అద్భుత శక్తిగా వర్ణించారు. నయాగరా జలపాతంపై నిర్మితమైన మూడు వంతెనలలో రెయిన్‌బో బ్రిడ్జ్ ఒకటి. ఈ వంతెనను నయాగర నదిపై నిర్మించారు.





ఇది యునైటెడ్ స్టేట్స్, కెనడాలను కలుపుతుంది. ఈ నదిపై నిర్మించిన బ్రిడ్జి ద్వారా ఉత్తర అమెరికా, కెనడా పర్యాటకులు ఆ వైపుకు, ఈ వైపుకు రాకపోకలు సాగిస్తూ నయాగర అందాలను తిలకిస్తుంటారు. కెనడా వైపు నుండి నయాగర జలపాతం అందాలు అద్భుతంగా ఉంటాయి. ఉత్తర అమెరికావారు కెనడా వెళ్లి నయాగరను చూడాలన్నా, కెనడావారు ఉత్తర అమెరికా వైపుకు వెళ్లి నయాగరను తిలకించాలన్నా వీసా తప్పనిసరి. నయాగరను తిలకించడానికి ప్రతి ఏడాది కోటిన్నర మంది పర్యాటకులు ప్రపంచ వ్యాప్తంగా వస్తుంటారని అంచనా. కొన్ని సందర్భాలలో ఈ జలపాతం వద్ద ఇంద్రధనస్సు ఏర్పడి కనువిందు చేస్తుంది.

## నయాగరపై సాహస విన్యాసాలు

చేస్తూ అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. తన వీపుపై మరో వ్యక్తిని మోస్తూ నయాగర జలపాతంపై ఏర్పాటు చేసిన రోప్‌వేపై నడుస్తూ సఫలీకృతులైనవారు కూడా ఉన్నారు. పలువురు ఈ జలపాతం పైనుండి దూకి డైయింగ్ చేస్తూ సాహసాలు చేశారు. ఈ సాహస ప్రయత్నంలో కొందరు విజయం సాధించి పేరు తెచ్చుకుంటే, మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం ఇటువంటి విన్యాసాలు చేయడం చట్టవిరుద్ధం. శిక్షార్హులౌతారు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత నయాగరను తిలకించడానికి వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. ఉదయంపూట తెల్లని నురగలు కక్కుతూ పాలధారలా కనిపించే నయాగర మధ్యాహ్నం మిలమిలా మెరుస్తుంది. రాత్రికి విద్యుద్దీపాల వెలుగులో ద్విగుణీకృత అందాలతో అద్భుతంగా కనిపిస్తుంది. 19వ శతాబ్దం నుండి ఈ జలపాతం ప్రభుత్వాలకు వినోదం, వాణిజ్యం, పారిశ్రామిక ప్రయోజనాల కేంద్ర బిందువుగా మారింది.

మంచుముద్దలా మారిన నయాగర

పలుమార్లు నయాగర జలపాతం ఆగిపోయింది. ఇక్కడ రాళ్లు పేరుకుపోయాయని, వాటిని తొలగించే క్రమంలో ఒకసారి నీటిని నిలిపివేశారు. ప్రభుత్వం కావాలనుకుంటే నయాగర జలపాతం నీటిని నిలిపివేసే విధంగా రూపొందించారు. మైనస్ డిగ్రీల చలి కారణంగా నయాగర నీరంతా మంచులా పేరుకుపోయి గడ్డకట్టుకుని ప్రకృతి సిద్ధంగా నయాగర నిలిచిపోయింది. చలి మైనస్ డిగ్రీలు ఉన్నప్పుడు నయాగర నీరంతా మంచులా గడ్డ కట్టుకుపోతుంది. ఇటువంటి సమయంలో నయాగర అద్భుత ప్రపంచంలా కనిపిస్తుంది. 1938లో ఒకసారి అమెరికా వైపు ఈ జలపాతం పూర్తిగా మంచుకొండలా మారిపోయింది. ఆ తరువాత అనేక పర్యాయాలు అమెరికా-కెనడా ఇరు వైపులా నయాగర మంచు కొండలా మారి నేత్రానందం చేసి పర్యాటకుల్ని వింత ప్రపంచంలోకి తీసుకువెళ్లింది. మరికొన్ని సందర్భాల్లో 90 శాతానికి పైగా నయాగర మంచు కొండలా మారిపోయి వాటి మధ్య నుండి మంచుతో కూడుకున్న నీరు సన్నని పాయలా పైనుండి కిందకు దుమికే దృశ్యం వర్ణనాతీతంగా ఉంటుంది.

**(మిగతా 22వ పేజీలో)**



# 'స్వర్ణ' భారత్

**కవర్ స్టోరీ**

**తండా సదానందం**

> అందరూ ఆరోగ్యవంతు లైనప్పుడు మాత్రమే సమాజం అభివృద్ధి చెందుతుంది. ఆరోగ్యవంతమైన శరీరంలోనూ ఆరోగ్యవంతమైన మనసు ఉంటుంది. ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా శారీరక నిర్మాణం చక్కగా ఉండాలి. శారీరక నిర్మాణం చక్కగా ఉన్నట్లయితే మనసు కూడా చక్కగా పని చేస్తుంది అంటారు రూసో.


**అందుకే** ఆధునిక సంక్షేమ రాజ్యాలు ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాయి. అందులో భాగంగానే క్రీడలకు ప్రాముఖ్యం ఇస్తున్నారు. మనిషి మనుగడతో ముడిపడి ఉన్న క్రీడలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసాన్ని కలిగించే పలు క్రీడలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందాయి. అటువంటి క్రీడలలో ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్ ముఖ్యమైనవి. ఇటీవల ముగిసిన 22వ కామన్వెల్త్ గేమ్స్ గురించి వాటిలో భారతదేశం కనబరచిన ప్రతిభ, పాల్గొన్న క్రీడాకారుల స్ఫూర్తిదాయకమైన జీవిత విశేషాలు, ప్రపంచ స్థాయిలో భారత స్థానం వంటి విశేషాలు...

కామన్వెల్త్ గేమ్స్ అంటే ఏమిటి?

ఒకప్పుడు గ్రేట్ బ్రిటన్‌కు వలసలుగా ఉన్న దేశాల సముదాయం కామన్వెల్త్. ప్రపంచ ప్రజలలో దాదాపు ప్రతి ముగ్గురిలో ఒకరు కామన్వెల్త్ నివాసి. చాలా దేశాలు ఒకప్పుడు బ్రిటిష్ పాలనలో వలస దేశాలుగా ఉండేవి. వాటన్నింటినీ కలిపి బ్రిటిష్ ఎంపైర్‌గా వ్యవహరించేవారు. కాలక్రమంలో ఆయా దేశాలు అన్నీ స్వతంత్ర దేశాలుగా మారడంతో బ్రిటిష్ ఎంపైర్ అంతరించిపోయింది. ఆ దేశాలు ఇప్పుడు కామన్వెల్త్‌గా మారాయి. కామన్వెల్త్‌లో సభ్యులుగా ఉన్న 53 దేశాలు ప్రజాస్వామ్యం, లింగ సమానత్వం, అంతర్జాతీయ శాంతి భద్రతల వంటి కొన్ని విలువలను పాటిస్తామని ప్రమాణం చేశాయి. ఈ కామన్వెల్త్‌కు బ్రిటన్ రాణి అధినేత. అందుకే కామన్వెల్త్ క్రీడలను ఆమె అధికారికంగా ప్రారంభిస్తారు. కామన్వెల్త్ గేమ్స్ మొదలైనప్పటి నుంచి రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా 1942, 1946లో మినహా ప్రతి నాలుగేళ్లకు ఒకసారి క్రమం తప్పకుండా నిర్వహిస్తారు. ఈ క్రీడల ప్రారంభానికి ముందు క్వీన్స్ బ్యాటన్ రిలే మొదలవుతుంది. కామన్వెల్త్ దేశాల క్రీడాకారులు శాంతియుత, స్నేహపూర్వక క్రీడా పోటీల్లో పాల్గొనాలంటూ బ్రిటన్‌రాణి సందేశంతో ఆ జ్యోతి కామన్వెల్త్ దేశాలన్నింటినీ చుట్టి వస్తుంది. ప్రారంభ సమయంలో బ్రిటన్ రాణి లేదా ఆమె ప్రతినిధి ఆ సందేశాన్ని చదవడంతో క్రీడలు ప్రారంభమవుతాయి. ఈ క్రీడలు మొదటిసారి 1930లో బ్రిటిష్ సామ్రాజ్యంలోని దేశాలతో స్నేహపూర్వక క్రీడా పోటీలు నిర్వహించాలని భావించి కెనడాలోని హామిల్టన్ వేదికగా బ్రిటిష్ ఎంపైర్ గేమ్స్ పేరిట జరిగాయి. మొదటిసారి పోటీలలో భారతదేశం పాల్గొనలేదు. రెండవసారి 1934లో జరిగిన గేమ్స్‌లో భారత్ సహా 16 దేశాలు పాల్గొన్నాయి. 1952లో బ్రిటిష్ ఎంపైర్ గేమ్స్‌ను బ్రిటిష్ ఎంపైర్ అండ్ కామన్వెల్త్ గేమ్స్‌గా మార్చారు. 1970లో తిరిగి బ్రిటిష్ కామన్వెల్త్ గేమ్స్‌గా మారింది. 1978లో తొలిసారిగా కామన్వెల్త్ గేమ్స్ పేరుతో క్రీడలు జరిగాయి. ఈ పోటీల్లో 46 దేశాల నుండి 1500 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. 2010లో భారతదేశం ఈ క్రీడలను నిర్వహించింది. ఢిల్లీలో జరిగిన పోటీలలో 71 దేశాలు పాల్గొన్నాయి.

సాధారణంగా వీటిని రెండు ఒలింపిక్‌ల మధ్య రెండేళ్ల తర్వాత, రెండేళ్ల ముందు నిర్వహిస్తారు. అగ్రరాజ్యాలు పాల్గొనకపోయినా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, కెనడా, న్యూజిలాండ్, భారతదేశాల క్రీడాకారులు కనువిందు చేసే ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడలు, ఒకనాడు బ్రిటిష్ పాలనతో ఉండి ఆపైన స్వతంత్రంగా మారిన దేశాల మధ్య క్రీడా మైదానాలలో జరిగే యుద్ధభేరి.. ఒలింపిక్ గేమ్స్‌తో పోలిస్తే కొంచెం స్థాయి తక్కువయినా వర్ధమాన ఆటగాళ్లను పరిచయం చేసే వేదిక. చిన్న దేశాలు సైతం క్రీడాస్ఫూర్తిని వెదజల్లే అవకాశం గల క్రీడలు. ఇన్నేళ్ల క్రీడల చరిత్రలో మొత్తం 932 స్వర్ణాలతో సహా 2415 పతకాలతో ఆస్ట్రేలియా అగ్ర స్థానంలో ఉండగా, 714 స్వర్ణాలతో 2144 పతకాలతో ఇంగ్లాండ్ దేశం రెండో స్థానంలో, మన దేశం 181 స్వర్ణాలతో, 173 సిల్వర్, 149 కాంస్య పతకాలతో మొత్తం 503 పతకాలు సాధించింది. అటు తర్వాత న్యూజిలాండ్, కెనడా, దక్షిణాఫ్రికా దేశాలు ముందంజలో ఉన్నాయి. జమైకా, కెన్యా వంటి దేశాలు కూడా అథ్లెటిక్స్ ముందు ఉన్నారు. 2002 నుండి భారత్ టాప్ ఫైవ్‌లో నిలబడు తుంది. ప్రస్తుతం 22వ కామన్వెల్త్ క్రీడలు 15వ వేదిక అయిన ఇంగ్లాండ్ దేశంలోని బర్మింగ్హామ్‌లోని అలెగ్జాండర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభించబడ్డాయి. గతంలో 1934లో లండన్‌లో, 2022 మాంచెస్టర్‌లో, ప్రస్తుతం మూడవసారి బర్మింగ్హామ్ వేదికగా ఇంగ్లాండ్ దేశం కామన్వెల్త్ క్రీడలను నిర్వహిస్తుంది. ఇప్పుడు 20 క్రీడాంశాలతో 72 దేశాల నుండి ఐదు వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. భారత కాలమానం ప్రకారం 28 జులై, 2022న రాత్రి పదకొండున్నర గంటలకు అంగరంగ వైభవంగా ప్రారంభించ బడ్డాయి. బ్రిటన్ యువరాజు చార్లెస్ ఆటలను ప్రారంభించగా, ఆయన రాణి ఎలిజబెత్ సందేశాన్ని చదివారు. ప్రారంభ వేడుకల్లో విశ్వ క్రీడల్లో రెండుసార్లు పతకాలు సాధించిన స్టార్ షట్లర్ పీవీ సింధు, హాకీ టీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్‌లు ఫ్లాగ్ బేరర్లుగా వ్యవహరించి భారత జట్టును ముందుకు నడిపించారు. గత క్రీడల్లోనూ సింధు పతాక ధారిగా వ్యవహరించింది.

తొలిసారిగా మహిళల క్రికెట్ పోటీలో టీ 20 రూపంలో, బాస్కెట్‌బాల్ 3-3, మిక్స్ సింక్రనైజ్ డ్రైవింగ్‌లను నూతనంగా ప్రవేశపెట్టడం ఈ పోటీల ప్రత్యేకత. కరోనా మహమ్మారి వల్ల టోక్యో ఒలింపిక్స్ క్రీడలు ఆలస్యం కావడంతో సంవత్సరంలోపే ఈ గేమ్స్ మన ముందుకు వచ్చాయి. వాస్తవానికి ఈ పోటీలు దక్షిణాఫ్రికా దేశంలోని డర్బన్‌లో జరిగేవి. 2015లో పోటీల నిర్వహణకు ఈ ఒక్క దేశమే బిడ్ వేయడంతో ఆ హక్కులు కేటాయించబడ్డాయి. అయితే ఆర్థికపరమైన సమస్యలతో తమ వల్ల కాదంటూ 2017లో చేతులెత్తేయడంతో ఈ వేదిక మారింది. ఈ క్రీడల మొత్తం బడ్జెట్ 778 మిలియన్ పౌండ్లు. ఈ మెగా క్రీడా సంబరంలో భారత్ నుంచి 215 మంది క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో 43 మంది, హాకీ 36, మహిళల క్రికెట్ 15, వెయిట్ లిఫ్టింగ్ 15, సైక్లింగ్ 13,



బాక్సింగ్ 12, రెజ్లింగ్ 12, టేబుల్ టెన్నిస్ 12, బ్యాడ్మింటన్ 10, లాన్‌బౌల్స్ 10, స్క్వాష్ 9, జిమ్నాస్టిక్ 7, స్విమ్మింగ్ 7, జూడో 6, ట్రయథ్లాన్ 4, పార పవర్ లిఫ్టింగ్‌లో 4గురు క్రీడాకారులు పాల్గొనగా, తెలుగు రాష్ట్రాల నుంచి 11 మంది పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, నిఖత్ జరీనా, హుస్సముద్దీన్ వంటి స్టార్ ప్లేయర్‌లతో పాటు ఆకుల శ్రీజ, పుల్లెల గాయత్రి, సుమిత్‌రెడ్డి, యారాజి జ్యోతి, క్రికెటర్ సబ్బినేని మేఘన, హాకీ ప్లేయర్ ఆంధ్రా గోల్కీపర్ ఏతిమరుపు రజిని వంటి యువ ఆటగాళ్లు పాల్గొని పతకాలు సాధించి తెలుగువారి సత్తా చాటారు. భారత బృందానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, క్రీడల మంత్రి అనురాగ్ శర్మ శుభాకాంక్షలు తెలిపారు.

కామన్వెల్త్ గేమ్స్ జులై 28న ప్రారంభో త్సవం సాంప్రదాయ బద్ధంగా ముగియ డంతో క్రీడాకారులు పతకాల వేట మొదలుపెట్టారు. తొలిరోజు స్విమ్మింగ్, ట్రాక్ సైక్లింగ్, జిమ్నాస్టిక్, ట్రయథ్లాన్ అనే 4 క్రీడాంశాల్లో 16 స్వర్ణాల కోసం పోటీలు జరిగాయి. ఈ నాలుగు ఈవెంట్లలో భారత క్రీడాకారులు



మీరాబాయి

పాల్గొన్నారు. మొదటి రోజు భారత అథ్లెట్లు మిశ్రమ ఫలితాలు సాధించారు. ఊహించినట్లుగానే బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, బాక్సింగ్ విభాగంలో విజయాలు సాధించారు. బ్యాడ్మింటన్ తొలి పోరులో మన దేశం 5-0 తేడాతో పాకిస్తాన్ ఓడించింది. బాక్సింగ్ క్రీడాకారులు శివతాపన్ ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. స్విమ్మింగ్, సైక్లింగ్‌లో పురుషుల విభాగంలో నిరాశాజనకమైన ఫలితాలు సంభవించాయి. మహిళా క్రికెట్‌లో భారత జట్టు ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. కామన్వెల్త్ క్రీడల్లో తొలి స్వర్ణం ట్రయథాన్లో ఇంగ్లాండ్‌కి చెందిన అలెక్స్ పొందింది. రెండవ రోజు భారత వెయిట్ లిఫ్టర్‌లు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి మూడు వేరు వేరు పతకాలతో తమదైన ముద్రను వేశారు. అందరిలో టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన మణిపూర్‌కు చెందిన మీరాబాయి చాను 49 కేజీల ఈ విభాగంలో అలవోకగా స్నాచ్‌లో 88 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 113 కేజీలుగా మొత్తం 201 కేజీల బరువు ఎత్తి బంగారు పతకం సాధించింది. మహారాష్ట్రకు చెందిన సంకేత్ మహాదేవ్ సర్గర్ పురుషుల 55 కేజీల విభాగంలో 248 కేజీల బరువు ఎత్తి రజత పతకం సాధించాడు. పురుషుల 61 కేజీల కేటగిరిలో కర్ణాటకకు చెందిన గురు రాజా పూజారికి కాంస్య పతకం లభించింది. మూడో రోజు కూడా కామన్వెల్త్ క్రీడల్లో భారత్ వెయిట్ లిఫ్టర్ రికార్డులు బద్దలు కొట్టారు. పురుషుల 67 కిలోల విభాగం లో గాయం వేధించినా సంకల్ప బలంతో మిజోరంకు చెందిన 19 ఏళ్ల జెరెమిలాల్ రినుంగ సంచలన ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. మహిళ ల 55 కేజీల విభాగంలో 23 ఏళ్ల బింద్య రాణీ దేవి రికార్డును తిరగరాస్తూ రజత పతకం సాధించింది.

నాలుగో రోజు భారత్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. మణిపూర్ యువతి 27 ఏళ్ల సుశీలా దేవి జూడో 48 కిలోలలో సౌత్ ఆఫ్రికా చేతిలో పరాజయం చవిచూసి రజత పతకంతో సరిపెట్టుకుంది. 2014 గ్లాస్గోలో ఆమె రన్నరప్‌గా నిలిచింది. దీంతో కామన్వెల్తులో సుశీలకు ఇది రెండో రజత పతకం కావడం విశేషం. మరో భారత వెయిట్ లిఫ్టర్ అద్భుత ప్రదర్శనతో మూడవ స్వర్ణాన్ని భారత ఖాతాలోకి చేర్చాడు. పురుషుల 73 కేజీల విభాగంలో బెంగాల్ లిఫ్టర్ అచింత షూలి స్నాచ్‌లో 143 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 170 కేజీలు మొత్తం 313 కిలోల బరువు వ్యక్తి అగ్ర స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని చేజిక్కించుకున్నాడు. లాన్ బౌల్స్ మహిళల ఫోర్స్‌లో భారత జట్టు చారిత్రికంగా ఫైనల్‌కు చేరుకుంది. అలాగే బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీం ఈవెంట్‌లో కూడా ఫైనల్‌లోకి అడుగు పెట్టింది.

ఐదో రోజు భారత్ రెండు బంగారు పతకాలతో సహా 3 పతకాలను సాధించి అదరగొట్టింది. ఏమాత్రం ఊహించకుండా బరిలోకి దిగిన భారత మహిళల లాన్ బౌల్స్ జట్టు స్వర్ణ పతకంతో చరిత్ర సృష్టించింది. పురుషుల 96 కిలోల కేటగిరిలో వికాస్ టాకూర్ 346 కిలోల బరువు ఎత్తి రజత పతకం సాధించాడు. మహిళల 76 కిలోల విభాగంలో పూనం యాదవ్ పేలవ ప్రదర్శనతో ఓటమి చవిచూసింది. భారత పురుషుల టేబుల్ టెన్నిస్ ముందు మరో బంగారు పతకాన్ని అందించింది. 2018 గోల్డ్ కోస్ట్‌లో జరిగిన కామన్ వెల్త్ క్రీడలలో చాంపియన్‌గా నిలిచిన భారత పురుషుల జట్టు సింగపూర్‌పై అద్భుత విజయం సాధించి టైటిల్ కైవసం చేసుకుంది.

**లాన్ బౌల్స్ అంటే..**

లాన్ బౌల్స్‌ను లాన్ బౌలింగ్ అని కూడా పిలుస్తారు. ఒక పెద్ద బంతి మరో చిన్న బంతితో ఆట సాగుతుంది. 15 కిలోల బరువుండే పెద్ద బంతిని బౌల్ అని, చిన్న బంతిని జాక్ అని పిలుస్తారు. సహజ గడ్డి లేదా కృత్రిమంగా ఏర్పాటు చేసిన దీర్ఘ చతురస్రాకార పచ్చి మైదానంలో ఆరుబయట ఈ ఆట ఆడతారు. మొదటగా ఆటాడే ప్రదేశంలోకి చిన్న బంతిని విసురుతారు. ఆ చిన్న బంతిని టార్గెట్ అంటారు. ఆటగాళ్లు మార్కింగ్ చేసిన ప్రదేశంలో మ్యాట్‌పై నిల్చొని పెద్ద బంతులను చిన్న బంతుల వైపు విసురుతారు. ఈ పెద్ద బంతులు చిన్న బంతి వద్దకు సాధ్యమైనంత దగ్గరగా ఉండేలా వేయడమే ఈ ఆటలోని నైపుణ్యం. పెద్ద బంతులను విసిరేందుకు ఆటగాళ్లు వివిధ రకాల నైపుణ్యాలను ప్రదర్శిస్తారు. మ్యాచ్ పూర్తయ్యాక పెద్ద బంతులకు, జాక్ బంతికి మధ్య దూరాన్ని టేప్‌తో కొలుస్తారు. జాక్ బంతికి అతి తక్కువ దూరంలో పెద్ద బంతులు ఉన్న దూరం ఆధారంగా పాయింట్లు కేటాయిస్తారు.


తేజస్విని శంకర్


వినేస్ పొగట్

కామన్వెల్త్ గేమ్స్‌లో అయిదు రోజులు పతకాల పంట పండించిన భారత క్రీడాకారులు ఆరవ రోజు మూడు పతకాలు కొల్లగొట్టారు. జూడో మహిళల 78 కిలోల విభాగంలో 23 ఏళ్ల తులికామాన్, స్కాట్లాండ్‌కు చెందిన ప్రత్యర్థి సారా ఆడింగ్టన్ చేతిలో పరాజయంపాలై రజత పతకంతో సరిపెట్టుకుంది. వెయిట్ లిఫ్టింగ్ పురుషుల 109 కేజీల విభాగంలో అమృత్సర్‌కు చెందిన ఇరవై నాలుగేళ్ల లవ్ ప్రీత్ సింగ్ ఏకంగా 355 కిలోల అత్యుత్తమ టోటల్‌తో కాంస్య పతకం అందుకున్నాడు. బ్యాట్మింటన్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ భారత మలేషియా చేతిలో ఓటమిపాలై రజత పతకాన్ని సాధించింది. మహిళల డిస్కస్ త్రోలో భారత స్టార్లు సీమా పూనియా, నవజీత్ ధిల్లాన్‌లు నిరాశపరిచారు.


అమిత్ పంఘల్

ఏడవ రోజు భారతీయ యువ అథ్లెట్ తేజస్విని శంకర్ చరిత్ర సృష్టించాడు. యూత్ గేమ్స్‌తో వెలుగులోకి వచ్చిన 23 ఏళ్ల ఢిల్లీ హై జంపర్ సీనియర్ క్రీడల్లో కాంస్య పతకం సాధించి కామన్వెల్త్ క్రీడల హై జంప్‌లో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారుడిగా చరిత్ర పుటలకు ఎక్కాడు. 2018 క్రీడల్లో 2.23 మీటర్లు దూకిన శంకర ఆరో స్థానంలో నిలిచాడు. ఈ సీజన్ అతడి అత్యుత్తమ ప్రదర్శన 2.27 మీటర్లు. మహిళా షాట్‌పుట్‌లో మనుప్రీత్ కౌర్ 15.69 మీటర్లు విసిరి 12వ స్థానంతో వెనుదిరిగింది.

రెండు రోజులుగా స్వర్ణ పతకం కోసం ఎదురు చూస్తున్న ఇండియాకు 8వ రోజు కుస్తీవీరులు తెర దించారు. రెజ్లింగ్ పోటీల తొలిరోజే భారత రెజ్లర్లు సత్తాని చాటారు. దీంతో రెజ్లింగ్‌లో ఏకంగా మూడు స్వర్ణ పతకాలు, ఒకటి రజత, 2 కాంస్య పతకాలు భారత్ ఖాతాలోకి చేరాయి. పురుషుల 65 కిలోల ఫ్రీ స్టైల్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, ఒలింపిక్ కాంస్య పతకం విజేత బజరంగ్ పునీయా అద్భుతంగా రాణించి టైటిల్ నిలబెట్టుకున్నాడు. మహిళల 62 కిలోల ఫ్రీ స్టైల్ ఫైనల్‌లో సాక్షిమాలిక్ అసమాన ప్రతిభను కనబరిచి కెనడా ప్రత్యర్థి గుంజా లెజ్‌తో హోరాహోరీ పోరాడి ఒక దశలో ఓటమి అంచున నిలిచిన సాక్షి అద్భుతంగా పుంజుకుని ప్రత్యర్థిపై

పైచేయి సాధించి అతిథి పతకాన్ని సొంతం చేసుకుంది. పురుషుల 86 కిలోల ఫ్రీ స్టైల్ ఫైనల్లో దీపక్ పూనియా పాకిస్తాన్‌కు చెందిన మొహమ్మద్ ఈనాంపై ఘన విజయం సాధించి బంగారు పతకాన్ని అందుకున్నారు. మహిళల 57 కేజీల విభాగంలో అన్షుమాలిక నైజీరియా చేతిలో ఓటమి పాలై రజత పతకంతో సరిపెట్టుకుంది. అలాగే దివ్య కాక్రాన్, మోహిత్‌లు కాంస్య పతకాలు సాధించారు. పోలియో వ్యాధితో దివ్యాంగుడుగా మారినా, ఆటల్లో తనదైన ముద్ర వేయాలని పట్టుదలతో శ్రమించి కామన్వెల్త్ గేమ్స్ జరిగిన పురుషుల పార పవర్ లిఫ్టింగ్ హెవీ వెయిట్ విభాగంలో అదరగొట్టిన హర్యానా రాష్ట్రానికి చెందిన సుధీర్ గోల్డ్ మెడల్ చేజిక్కించుకున్నాడు. అదే విధంగా పురుషుల లాంగ్ జంప్‌లో మురళి శ్రీశంకర్ నరాలు తెగే ఉత్కంఠ నడుమ అయిదో ప్రయత్నంలో 8.08 మీటర్ల దుమికి పురుషుల లాంగ్ జంప్‌లో రజత పతకం అందుకున్నాడు. టోక్యో పారా ఒలింపిక్స్‌లో రజత పతకంతో సత్తా చూపిన భవీన పటేల్ కామన్వెల్త్‌లోనూ అదే జోరు కొనసాగించి టేబుల్ టెన్నిస మహిళల సింగిల్స్‌లో ఫైనల్స్ చేరుకొని భారత్‌కు ఓ పతకాన్ని ఖరారు చేసింది. ఒకవైపు భారత రెజ్లర్లు, మరోవైపు అథ్లెట్లు తొమ్మిదివ రోజు భారత్‌కు పతకాల పంట పండించారు. భారతదేశ ఖాతాలో మూడు స్వర్ణాలు, మూడు రజ పతకాలు, 5 కాంస్య పతకాలతో మొత్త 11 పతకాలు చేరాయి. కుస్తీ పోటీల రెండో రోజు స్టార్ రెజ్లర్లు వినేష్ పొగట్ వరుసగా మూడవ బంగారు పతకంతో కామన్‌వెల్త్ గేమ్స్‌లో హ్యాట్రిక్ సాధిం చింది. ఒలింపిక్స్ రజత పతక విజేత రవికుమార్ దహియా నైజీరియాకు చెందిన వెల్సన్‌ను మట్టి కరిపించి తొలి స్వర్ణాన్ని చేజిక్కించుకున్నాడు. పురుషుల 74 కిలోల ఫైనల్‌లో పాకిస్తాన్ ప్రత్యర్థి మహమ్మద్ షరీఫ్‌ను ఓడించి నవీన్ కుమార్ చాంపియన్‌గా ఆవిర్భవించాడు. అంచనాలను తలకిందులు చేసి అవినాష్ సబ్లీ 3 వేల మీటర్ల ష్టిపుల్చజే, ప్రియాంక గోస్వామి 10 వేల మీటర్ల రేస్ వాక్ విభాగంలో వ్యక్తిగత అత్యుత్తమ సమయాలు నమోదు చేసే పతకాలతో సత్తా చాటారు. అలాగే లాన్బౌల్స్ పురుషుల విభాగంలో భారత జట్టు చారిత్రక రజత పతకం అందుకుంది. బాక్సింగ్‌లో తెలుగు కుర్రాడు హుస్సాముద్దీన్, జాస్మిన్లు కాంస్య పతకాలకే పరిమితం అవగా, నిఖత్ జరీన్, అమిత్‌లు ఫైనల్‌కు చేరారు. ఇదిలా ఉండగా భారత మహిళల హాకీ జట్టుకు ఆశనిపాతమైంది. నాలుగు సార్లు చాంపియన్ అయినా ఆస్ట్రేలియాపై స్ఫూర్తిదాయక ప్రదర్శన చేసిన క్లాక్ సిద్ధం కాలేదని అంపైర్ వివాదాస్పద నిర్ణయంతో ఆసీస్ చేతిలో పరాజయం పాలైంది. పదో రోజు కూడా పతకాల వర్షం కురిసింది. భారత బాక్సర్ల పంచులకు స్వర్ణాలు వెల్లువెత్తాయి. తెలుగుతేజం నిఖత్ జరీన్, అమిత్ ఫంగల్, యువ బాక్సర్ నీతూ గంగాస్‌లు స్వర్ణాలు సాధించారు. ఎల్డోస్ పాల్, అబ్దుల్లాలు ట్రిబుల్ జంప్‌లో తొలి రెండు స్థానాలు కైవసం చేసుకొని బంగారు రజత పతకాలు సంపాదించారు. పార టేబుల్


సంజీవరాజ్‌పుట్

టెన్నిస్ స్టార్ భవినా పటేల్ బంగారు పతకాన్ని పొందింది. 16 సంవత్సరాల తర్వాత భారత మహిళల హాకీ జట్టు కాంస్య పతకం అందుకుంది. చివరి రోజు తెలుగు స్టార్ పీవీ సింధు, ఆచంట శరత్ కమల్, సాత్విక్, సాయి రాజ్‌ల విజృంభణతో ఏకంగా 4 గోల్డ్ మెడల్ అందుకొని దుమ్ము లేపేసారు. పురుషుల హాకీలో భారతదేశం రజత పతకంతో సరిపెట్టుకుంది. ఏక పక్షంగా జరిగిన ఫైనల్‌లో 0-7తో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. ఇంతకు ముందు కూడా 2010, 2014 క్రీడా పోటీలలో ఆస్ట్రేలియా చేతిలో ఫైనల్‌లో ఓడిపోవడం జరిగింది. ఇది భారత్‌కు మూడవసారి. 1998లో కామన్వెల్త్ క్రీడల్లో హాకీ గేమ్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచి ఆస్ట్రేలియానే విజేతగా నిలిచింది. మొత్తం 22 స్వర్ణాలు, 16 రజతాలు, 23 కాంస్య పతకాలతో 61 పతకాలు గెలిచి నాలుగవ స్థానంలో నిలిచింది 2010లో సొంత గడ్డపై జరిగిన క్రీడల్లో 38 స్వర్ణాలు సహా 101 పతకాలతో పట్టికలో మన దేశానికి రెండో స్థానం దక్కింది. 2002లో 30 స్వర్ణాలు సహా అరవై తొమ్మిది పతకాలు సాధించడం తర్వాత ఉత్తమ ప్రదర్శన. 2018లో 26 స్వర్ణాలతో 66 పతకాలు సాధించి మూడో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఉత్తమ ప్రదర్శన అంటే 2022 క్రీడల్లోనే. 2018 వరకు భారతదేశం కామన్వెల్త్ క్రీడల్లో 203 స్వర్ణాలు సాధించగా అందులో షూటింగ్ వాటా 63. ఈసారి షూటర్లు లేకుండానే భారత్ 22 స్వర్ణాలు సహా 61 పతకాలు సాధించడం గొప్ప ప్రదర్శనే.

## మట్టిలో మాణిక్యాలు

### 1. పతకం పట్టిన పాన్‌వాలా... సంకేత్

2018 గోల్డ్ కోస్ట్ కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్‌లో పోటీ పడుతున్న గురు రాజా పూజారిని పాన్ షాప్‌లో కూర్చుని సంకేత్ టీవీలో చూస్తున్నాడు. గురు రాజా 56 కేజీల విభాగంలో రజతం సాధించడాన్ని తిలకించిన సంకేత్ నాలుగేళ్ల తర్వాత ఎలాగైనా అక్కడికి చేరుకుని కష్టపడి కచ్చితంగా పతకం సాధించాలని తనకు తాను అనుకున్నాడు. నిజంగానే తన కల నెరవేర్చుకున్నాడు. 2013 నుంచి వెయిట్ లిఫ్టింగ్‌లో ఉన్న ఆ కుర్రాడు ప్రస్తుతం 22 ఏళ్ల వయసులో కామన్వెల్త్ పతకంతో సత్తా చాటాడు. అధిక బరువు ఎత్తే ప్రయత్నం లో చేతికి గాయమైనా వెరవకుండా మరోసారి ప్రయత్నించి విఫలమైనా దేశా నికి బంగారు పతకం అందించాలనే అతని తపనకు ప్రజలు నీరాజనం పడుతున్నారు. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాకు చెందిన వెయిట్ లిఫ్టర్ సంకేత్ కుటుంబం పాన్ షాప్‌తో పాటు చిన్న హోటల్ నడుపు తుంది. చిన్నపాటి వ్యాపారంతో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ స్కూల్‌కి వెళ్లి ఆ సమయంలో ప్రాక్టీస్ చేసేవాడు. పేదరి కంతో కష్టాలు, నష్టాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొంటూ దేశం గర్వించదగ్గ లిఫ్టర్‌గా ఎదిగాడు. సంకేత్ తండ్రి మహాదేవ్‌కు ఆటలంటే ఎంతో ఇష్టం. దీంతో కొడుకును ఆ దిశగా పయనింప చేశాడు. మొదట్లో తోపుడుబండిపై పండ్లు అమ్మినా ప్రాక్టీస్ కోసం వ్యాయామశాలలో చేర్పించాడు.

**2. ఫోన్‌లో ఫొటో ప్రేరణ పొందిన జెరెమీ**

మిజోరాం రాజధాని ఐజ్వాల్కి చెందిన జెరెమీది క్రీడాకారుల కుటుంబం. తండ్రి లాల నిత్లు వంగ బాక్సింగ్ క్రీడాకారుడు. పోటీలో గాయాలపాలైనా ఉక్కు సంకల్పంతో అత్యున్నత వేదికపై పసిడి పతకంతో మెరిశాడు.

**3. స్వర్ణ పతకాన్ని పూజించిన ఆచింత**

కడు పేదరికం, అకస్మాత్తుగా తండ్రి మరణం, కనీసం దహన సంస్కారాలకు డబ్బుల్లేక ఏడ్చిన అనుభవం, కుట్టుపనులతో బతుకుబండిని లాగుతున్న తల్లి, తమ్ముడి ఆశయం కోసం కూలిగా మారిన అన్న, చాలీచాలని తిండితో, అర్థాకలి అనుభవిస్తూ పసితనంలోనే మోయలేనన్ని కష్టాలు మోసిన ఆచింత షూలి పశ్చిమ బెంగాల్‌లో హవ్డా జిల్లాలోని చిన్న ఊరు దేవుల్‌పూర్ గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించాడు. 2013లో తండ్రి జగత్ గుండెపోటుతో మరణించారు. తండ్రి అంత్యక్రియలకు కూడా డబ్బులు లేవు. తమ్ముడిలోనే ఎక్కువ ప్రతిభ దాగుందని గుర్తించిన అన్న అలోక్ కుటుంబ పోషణ కోసం కూలిగా మారి ఆచింత షూలిని ముందుకు నడిపించాడు. 2015లో ఆర్మీ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో అవకాశం దక్కడంతో జీవితం మలుపు తిరిగింది. తాజాగా కామన్వెల్త్ గేమ్స్‌తో పురుషుల 73 కిలోల విభాగంలో మొత్తం 313 కిలోల బరువు ఎత్తి అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

**4. పోరాట విజయుడు.. తేజస్విన్ శంకర్**

కామన్వెల్త్ క్రీడల హై జంప్‌లో పతకం సాధించిన తొలి భారతీయ క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించిన ఢిల్లీకి చెందిన తేజస్విన్ కామన్ వెల్త్ క్రీడల్లో పాల్గొనడానికి ఎంతో పోరాటం చేయవలసి వచ్చింది. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని శ్రీశ్రీ గారు అన్నట్లు కోర్టును ఆశ్రయించి వ్యవస్థలతో పోరాడి, అసలు పోటీలో పాల్గొనే అవకాశం వస్తుందో లేదో అనే ఊగిసలాటలో, చివరి నిమిషంలో చోటు దక్కించుకుని, పాల్గొన్న తొలుతనే కాంస్య పతకం సాధించిన యువ క్రీడాకారుడు. మరో అథ్లెట్ ఆరోకియ రాజ్ ఫిట్నెస్‌లో విఫలమవడంతో తేజస్వినికు మార్గం సుగమమైంది. చిన్నప్పుడు క్రికెట్ ఎక్కువగా ఆడే శంకర్‌కు ఎనిమిదో తరగతిలో ఫిజికల్ ట్రైనింగ్ మాస్టారు హై జంప్‌కు మారాలని సలహా ఇవ్వడంతో అటుగా ప్రయత్నించి విజయం సాధించాడు.

**5. మెరిసిన తెలుగు తేజం**

ఒలింపిక్స్‌లో రజత పతక విజేత, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు రజతాలు, ఒక స్వర్ణం సాధించి, ఎన్నో సూపర్ సిరీస్ టైటిళ్లు సొంతం చేసుకున్న తెలుగు అమ్మాయి పీవీ సింధు కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతకాన్ని కైవసం చేసుకొని తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేస్తుంది. గతంలో తొలిసారి కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొని కాంస్య పతకాన్ని, రెండోసారి రజత పతకంతో సరిపెట్టుకుని మూడో ప్రయత్నంలో బర్మింగ్హామ్‌లో పట్టుదలతో కష్టపడి తొలి వ్యక్తిగత బంగారు పతకం సాధించడం సంతోషదాయకం. త్వరలో జరగనున్న ప్రపంచ చాంపియన్‌షిప్ ముందు కామన్వెల్త్ పతకం ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని సింధు తెలిపింది.

కామన్వెల్త్ క్రీడల్లో 61 పతకాలతో పతకాల పట్టికలో నాలుగో స్థానం సాధించినా, క్రీడా ప్రగతిలో దేశం ఎంతో వెనుకబడి వుందని చెప్పాలి. మొన్న జరిగిన ఒలింపిక్స్ గేమ్స్‌లో చాలా పేలవమైన ప్రదర్శన ప్రదర్శించడం జరిగింది. ప్రపంచ స్థాయి సామర్థ్యాన్ని అందుకోవడంలో భారతీయ క్రీడాకారులు వెనుకంజలోనే ఉన్నారు. అందుకు కారణం ప్రభుత్వాల నుండి ప్రోత్సాహం లభించకపోవడమే. లక్షల కోట్ల బడ్జెట్‌లో క్రీడా రంగానికి అతి తక్కువగా కేటాయించడమే. క్రీడా రంగాన్ని ప్రాధాన్యం లేని రంగంగా శృతకన్ను వేయడంతో భారతదేశంలో క్రీడా ప్రగతి శూన్యం. ఇండియాలో మెడల్స్ సాధించిన తరువాత సహాయపడేందుకు మేమంటే మేమున్నామని ముందుకు వస్తారని, సాధించక ముందు పతకాలు నెగ్గడానికి ఎవరు సహకరించారని ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు, భారతజాతి గర్వించదగ్గ పరుగుల రాణి పి.టి. ఉష అన్నట్లు శిక్షణ సమయంలో ఆర్థికంగా, సరైన వసతులు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రాడాకారులకు చేయూతనివ్వకపోవడం బాధాకరం. జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో తమ సొంత ఖర్చులతో పాల్గొని పతకాలు సాధించినా, ఉద్యోగ ఉపాధి లేకపోవడం మూలంగా గ్రామీణ ప్రాంతాలలో పలు జాతీయ శిక్షణా సంస్థలలో శిక్షణ పొంది, పని చేయడానికి ఉద్యోగ కల్పన లేకపోవడంతో వారి నైపుణ్యాలు నీరు కారుతున్నాయి. ప్రస్తుత సమాజంలో పాఠశాలలో ఆట స్థలాలు, గ్రామాలలో పట్టణాలలో క్రీడా మైదానాలు కరవై భావితరాలు శారీరక శిక్షణ, ఎదుగుదల లేక మానసిక దౌర్బల్యంతో, విలువల రాహిత్యంతో క్రమశిక్షణ లేక దుర్వ్యసనాలకు లోనై, సెల్‌ఫోన్ మాయాజాలంలో బందీలై తమ విలువైన, అమూల్యమైన జీవితాలను కోల్పోతున్నారు. అధునాతనమైన, శాస్త్రీయమైన శిక్షణ, గంటలపాటు కఠోర సాధనతోనే ప్రపంచ స్థాయి క్రీడాకారుడిగా రూపొందించబడతారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఎన్నో కమిటీలు, ఎంతో మంది విద్యావేత్తలు భావితరాలని వ్యాయామ విద్యతో పరిపుష్టికరించాలని పేర్కొన్నాయి. క్రీడా మైదానాల్లో యువకులు, విద్యార్థుల చెమటోడ్చాలనీ చెబుతున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. విద్యాహక్కు చట్టంలో చెప్పినట్టు కార్యాచరణ లేదు. క్రీడా సమాఖ్యలు అవినీతి కంపుతో రాజకీయ రచ్చతో కొట్టుమిట్టాడుతున్నాయి.

బాల్యంలోనే క్రీడల పట్ల ఆసక్తి వున్నవారిని గుర్తించి చైనా దేశంలోలాగా వారికి అండదండలు ఇవ్వాల్సి ఉండగా- అలా చేయకుండా పూర్తిగా నిర్లక్ష్య వైఖరితో క్రీడా రంగాన్ని భ్రష్టు పట్టించారు. రాజకీయ కక్షతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ క్రీడల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా భావితరాల భవిష్యత్తుకు భద్రత లేకుండా చేయడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియాకు తెలంగాణ రాష్ట్రానికి కేవలం 24 కోట్లు మాత్రమే కేటాయించి, గుజరాత్ రాష్ట్రానికి 608 కోట్లు కేటాయించడం వివక్ష పూరితమైన చర్యగానే భావించాలి. ఇటీవల జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించిన తెలంగాణకు అతి తక్కువగా కేటాయించి, అసలు పతకాలే సాధించని గుజరాత్ రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయించడంలో ఆంతర్యం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. క్రీడలు పిల్లల జీవితాలలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. క్రీడలవల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. పిల్లలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఎదిగేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయి.

## పిల్లలకు ఆటల వల్ల ఉపయోగాలు

మానసిక ఎదుగుదలకు, సోషల్ స్కిల్స్, టీం వర్క్ మెళవకువలు, శారీరక ఎదుగుదల, ఆరోగ్యకరమైన గుండెకి, శ్వాసకు, రోగ నిరోధక శక్తి పెరుగుదలకు, కాంపిటేటివ్ స్పిరిట్, అనుకూల వైఖరి, ఓర్పు, సహనం ఏకాగ్రత, స్టామినా, గెలుపు-ఓటముల విలువ తెలుసుకుంటారు. ఇన్ని ప్రయోజనాలున్న క్రీడలను అభివృద్ధిపరచాలి. ప్రాథమిక విద్యతోనే వ్యాయామ విద్యను కూడా మిళితం చేసినట్లయితే పిల్లల్లో శారీరక, మానసిక వికాసం అత్యుత్తమంగా ఉంటుంది. తద్వారా క్రీడల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చు. ఆ దిశగా పాలక ప్రభుత్వాలు కృషి చేసినట్లయితే యావత్ భారత దేశం ఏ క్రీడా పోటీలలో అయినా పతకాల పట్టికలో అగ్ర భాగాన నిలవవచ్చు.

•

## ప్రజల బాధ్యతల్ని తెలిపే పుస్తకం



గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి రచించిన 46 కవితల సంపుటి 'విహంగం'. అందమైన ముఖచిత్రంతో చక్కగా తయారయిన కవితల పుస్తకం ఇది. ఇందులోని ప్రతి కవితలో ప్రజల పట్ల, ప్రజల నిత్యజీవితంలోని కడగండ్ల పట్ల రచయిత సానుభూతి స్పష్టంగా వ్యక్తమవుతాయి. ప్రజల సమస్యల పట్ల స్పందిస్తూ, ప్రజల కర్తవ్యం, బాధ్యతలను సైతం ఎత్తి చూపిస్తాయి. ఇందులోని కవితలు 'హక్కులంటే అందరికీ ప్రీతి/ విధులంటే ముడుస్తారు మూతి' అంటారు 'ఎటు చూసినా దేశమే' అనే కవితలో. ఈ కవితలలో సామాజిక దృక్పథంతో పాటు ప్రకృతితో మమేకం అవటం ప్రకృతి నేర్పే పాఠాలను గ్రహించాలన్న చైతన్యం కూడా కనిపిస్తుంది.


'సంక్రమణ మబ్బుల తేనె తుంపరలకు/ మనసులు మధురోల్లాస భరిత మౌతున్నాయ్' అంటాడు 'కొత్తపండుగ' అనే కవితలో. అక్కడక్కడా చక్కని ఆలోచనలు కవితలు చమక్కు మంటుంటాయి. 'అందరూ కనబడని వస్తువు కోసం/ కలవరపడుతున్నారు/ కొందరికి గమ్యం తెలుసు/ గమ్యం లేని గమనంలో కొందరు..' అంటారు 'గమ్యం' కవితలో.

చక్కని భావాలతో సరళమైన భావ వ్యక్తీకరణతో ఆలోచింపచేస్తూ, అలరించే కవితల సంకలనం 'విహంగం'.

**(విహంగం, రచన: గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, వెల: రూ 100, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును)**

**- నిర్మోహి**

## అడిగోపుల మ్రోగిస్తున్న కవితా 'జయభేరి'



సీనియర్ కవి అడిగోపుల వెంకటరత్నమ్ వెలువరించిన 25వ కవితా పొత్తం 'జయభేరి'. దాదాపు నాలుగు దశాబ్దాలుగా యింత విస్తృతంగా కవితా ప్రస్థానం కొనసాగిస్తున్న కొద్దిమంది కవుల్లో అడిగోపుల ఒకరు. యిదివరలో ఆయన రెండు కవితా సంపుటిలపై సమీక్షలు రాసినట్లు గుర్తు. తాజా సంపుటి 'జయభేరి'లో 57 కవితలు చదివిన తర్వాత సెలయేరు లయలు, గాయపడ్డ నదులు, శపించిన నీళ్లు, రెచ్చిపోతున్న సంద్రం, కరకట్టలు కరిగిపోయే కన్నీరు, ఎండిన పొలాన్ని వంటివి పిండి తడి చేస్తున్న వైనం. పంటని ఆహుతి చేస్తున్న వర్షం, నగరంలో వాన, కళ్ల జలాశ యాలు గుండెల్ని తడితడిగా తడిమి ఆర్ద్రతకు లోనుగావడం ఖాయం. 'భూమి తన చుట్టూ తాను తిరుగుతుంది. రైలు దేశం చుట్టూ తిరుగాడుతూ వుంది'! అంటు రైతును సహృదయ రాయబారిగా, సమైకతావాదిగా, గాన వేదికగా, వర్తక కేంద్రంగా, సమతావాదిగా వర్ణిస్తూ మనల్ని 'మరోలోకం'లో విహరింపజేస్తాడు. 'మనిషి రూపాయిగా మారాక/ మానవ సంబంధాలన్నీ/ ఆర్థిక సంబంధాలు/ బంధాలు కృతకమయ్యాక/ సంబంధాలు క్షణికాలు' అంటూ మారిపోయిన మనిషిని మన కళ్లముందు నిలబెట్టాడు. అడిగోపుల వెంకటరత్నమ్ కవిత్వం చదవడం ఓ గొప్ప అను భవం..అనుభూతి. **(జయభేరి, రచన: అడిగోపుల వెంకటరత్నమ్, వెల: రూ 100, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, 27-30-4/3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట్, విజయవాడ)** **- రమణ వెలమకన్ని**

**పుస్తక సమీక్ష**

## 'ఆమె మారింది' గంటి భానుమతి

గంటి భానుమతి 'ఆమె మారింది' నవల మహిళల స్వేచ్ఛా, స్వతంత్రతకు ప్రాధాన్యత, విద్యాధికురాలు, ఉద్యోగం చేసే మహిళల జీవితాలలో ఎదుర్కొనే సంఘర్షణకు అద్దం పట్టింది. సుధీర వైవాహిక జీవితంలో కూడా, మరొక భవిష్యత్తులోకి వెళ్లడానికి నిర్ణయం చేసుకోవడంతో నవల ప్రారంభమవుతుంది. అమెరికా



వెళ్లలేకపోవటం, భర్త చెల్లెలుకు సహాయం వంటి సంఘటనలు, ఆమె ఆలోచనలలోని లోపాలను రచయిత్రి, అత్యంత ప్రతిభావంతంగా కథను నడిపి మలుపు తిప్పారు. నిజజీవితంలో మానవ సంబంధాల విలువలను గ్రహింపచేయడం, ఆమె చివరకు ఇల్లు విడిచి, కుటుంబాన్ని విడిచి వెళ్లలేకపోవటం రచయిత్రి రచనా కౌసల్యత, ప్రజ్ఞకు నిదర్శనంగా నవల విజయవంతమైంది.

'అపరాజిత గుప్పిళ్లు మూసుకునిపోయింది. మామ్మగారు చేతులు తెరుచుకొని పోయారు. రెంటిదగ్గరా శూన్యమే, ఏమీ లేదు. మిగిలేది ఏం లేదు' అంటూ నవలలోని వైవాహిక మహిళ సుధీరను విచక్షణాజ్ఞానం, మానవతా విలువలతో రచయిత్రి తత్త్వజ్ఞానంతో నవలను నడిపించారు.

రచయిత్రి భానుమతి అభినందనీయురాలు.

**(ఆమె మారింది, రచన: గంటి భానుమతి, వెల: రూ 150, ప్రతులకు: 205, బ్లాక్-1, బైప్లవర్ పార్క్ అపార్ట్‌మెంట్స్, మల్లాపూర్, హైదరాబాద్-500076)** **- ఎర్రమిల్లి**

ప్రకృతి, ఆధ్యాత్మికత స్త్రీలు, విద్య, ఓటుహక్కు తత్త్వం, పర్యావరణం మీద ప్రేమ, గాంధీ, అంబేద్కర్, కరోనా, ఆడపిల్లల మీద అత్యాచారాలు, జనాభా నియంత్రణ, బాల్యం, వలస కార్మికుల వెతలు పోలీసన్న, భూములు కోల్పోతున్న రైతన్న, అమ్మమీద అపారమైన ప్రేమ, అర్థాంతరంగా

## ఆలోచనకు, అభివ్యక్తికి సమన్వయం



అంతర్థానమైన నాన్న ఒక్కటేమిటి కన్నవీ, విన్నవీ, అన్నీ మహమ్మద్ హసేన కవితావస్తువులయ్యాయి. ఇది ఆయన తొలిసంపుటి. 25 ఏళ్ల కవితా ప్రస్థానంలో రాసింది కొద్దే కావొచ్చు, కాని రాసినవన్నీ డా।।ఏనుగు నరసింహారెడ్డి వ్రాకుచ్చినట్లు బహిరంతర సమాజాలని జాగరూకతతో పరిశీలించి రాస్తున్నాడు. కవి సమాజాన్ని నిశితంగా పరిశీలించాలి అంటారు ప్రొ।। సూర్యాధనుంజయ్. ఈ కవి చేసింది అదే! 'ముస్లిం మైనారిటీవాద నవలలు'పై పరిశోధించి డాక్టరేట్ పట్టా పుచ్చుకున్న ఈ కవికి, హిందూ పౌరాణిక పాత్రలు కరతామలకం. కృష్ణుడిని రాముడిని మేనేజ్‌మెంట్ గురువుల్లా.. ఎక్కడనెగ్గాలో, ఎక్కడ తగ్గాలో, విశ్లేషించి చూపిన విమర్శకుడు. పుట్టుక నీది చావు నీది/ బ్రతుకంతా దేశానిది' అంటూ కాళోజీని కాపీ చేసినా 'తీరం వలె నువ్వు కెరటం వలెనేను (నువ్వు- నేను. పే9) అంటూ అంతగా అతకని పోలిక చూపినా, మహమ్మద్ హసేన కవితా సంపుటి పాఠకుల్ని పరవశింప చేస్తుంది.

**(బిడ్డా ఎప్పుడొస్తవ్, రచన: డా।।మహమ్మద్ హసేన, వెల: రూ 120, ప్రతులకు: పాలపిట్ట, హైదరాబాద్)** **- కూర చిదంబరం**

# పాలరాతిని తలపించే షోలాపిత్ చెక్కబొమ్మలు



ఈ కాండానికి 'హెర్బల్ ఐవరీ లేదా ప్లాంట్ మార్బుల్' అన్న పేర్లే సరిపోతాయి అంటారు షోలాపిత్ కళాకారులు. ఆ కాండంతో విగ్రహాలను, అలంకరణ వస్తువులను తయారు చేస్తే అచ్చం పాలరాతితోనో, ఏనుగు దంతంతోనో చేసినట్లే అనిపిస్తాయి. మడ అడవుల్లో సన్నగా, పొడవుగా పెరిగే ఈ మొక్క శాస్త్రీయ నామం ఎష్కినొమెనె ఆస్పరా. దీని కాండం లోపల ఖాళీగా ఉండటంతో అది తేలికగా బెండులా ఉంటుంది. అందువల్ల దీనిని ఇండియన్ కార్క్ అని పిలుస్తారు.

ఈ కాండంతో దేవతా విగ్రహాలను, అలంకరణ వస్తువులను, పూలమాలలను, బెంగాలీ వధూవరులు పెళ్లిలో ధరించే కిరీటాలను తయారు చేస్తారు. అయితే ఇటీవల దీనితో చేసే కళారూపాల సంఖ్య పెరిగింది. ఇది థెర్మాకోల్/స్టైరో మాదిరిగా ఉండటంతో పాటు సోలాపిత్ ఉన్న మెరుపు కారణంగా వీటితో అందమైన బొకేలను సైతం తయారు చేస్తున్నారు. దాంతో అవి ప్రపంచం నలుమూలలకీ ఎగుమతి అవుతున్నాయి. పాశ్చాత్య దేశాల్లో వధువు చేతికిచ్చే పుష్పగుచ్ఛాలను ఈ కాండంతోనే తయారు చేస్తున్నారట. సహజ పూలను తలపించేలా వీటికి రంగులను అద్దుతున్నారు. ఇంట్లో అలంకరించుకునే కాక్టస్ మొక్కలను, పెళ్లిలో వేసుకునే వరమాలలను సైతం ఈ పూలతోనే తయారు చేస్తున్నారు. మగవులు సిగలో తురుముకునే మల్లెపూల మాల అయితే అసలు పూలనే మరిపించేంత స్నిగ్ధ సోయగంతో మెరిసిపోతుంది. ఈ చెక్కపూలు తేలికగా ఉంటాయి. వాడిపోవు అన్న కారణంతో నేటి తరం అమ్మాయిలు వీటిని అలంకరించుకుంటున్నారు. వీటితో బొమ్మలు, తోలుబొమ్మలు, చిత్రపటాలు, విగ్రహాలు ఇలా.. ఎన్నెన్నో తయారు చేస్తున్నారు.

అసలైన షోలాపిత్ అందాలు చూడాలంటే బెంగాలీయుల దుర్గాపూజ మహోత్సవాలను చూడాల్సిందే. ఆ సమయంలో అక్కడ వెలిసే పండాల్స్‌లోని విగ్రహాలకి తెల్లని షోలాపిత్ అలంకరాలు ఎంతో అందంగా కనిపిస్తాయి. కొందరు కళాకారులు విగ్రహాలను సైతం ఈ చెక్కతోనే చేసి ఔరా! అనిపిస్తుంటారు. అక్కడే కాదు ఇంట్లో చేసుకునే పూజలు, పండగల వేళలోనూ పెళ్లి వేడుకల్లోనూ వేదిక వెనుక భాగంలో ఈ చెక్కతో చెక్కిన వాటిని బ్యాక్‌డ్రాప్‌గా వాడుతుంటారు. ఇక వేసవిలో పశ్చిమ భారతావనిలో ఈ కాండంతో చేసిన టోపీల వాడక ఎక్కువట. తేలికగా వుండటంతో పాటు గాలి బాగా ఆడుతుందని ఈ పిత్ టోపీలు పెట్టుకుంటారు. కాలక్రమంలో వీటి వాడకం తగ్గినప్పటికీ రక్షణ దళాల్లో ఈ టోపీల్ని నేటికీ వాడుతున్నారు.

ఎక్కడ పెరుగుతాయి..

అసోం, బెంగాల్, ఒడిశా ప్రాంతాల్లో షోలాపిత్ మొక్కలు ఎక్కువగా పెరుగుతాయి. అందువల్ల ఆయా రాష్ట్రాల్లో ఈ కాండంతో కళారూపాలు చెక్కుతుంటారు. ఈ కాండం రెండు మూడు అంగుళాలు ఉంటుంది. మృదువుగా వుండే ఈ కాండంతో కోరిన రూపం తీసుకు రావడం అంత సులభం కాదు. ఏ చిన్న పొరపాటు జరిగినా అది పాడైపోతుంది. కళాకారులకు వీటిని తయారు చేయడం వారికి వెన్నతో పెట్టిన విద్యని చెప్పవచ్చు. ఈ మొక్కలు బెంగాల్‌లోని బిర్భూమ్, బర్ద్వాన్, ముర్షిదాబాద్, హుగ్లి, దక్షిణ 24 పరగణాల జిల్లాల్లో ఎక్కువగా ఈ కళారూపాలు తయారవుతాయి. అక్కడి నుండి దేశ విదేశాలకు ఎగుమతి అవుతాయి. ఇప్పుడిప్పుడే ఈ మొక్కలను తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పెంచుతున్నారు, వీటితో కళారూపాలను తయారు చేస్తున్నారు.



**ఎలా తయారు చేస్తారు..**

కాండం ముదిరిన తరువాత మొక్కను పీకి ఎండబెడతారు. తరువాత పై భాగాన్ని తీసి లోపలున్న తెల్లని బెండు లాంటి కాండాన్ని కావలసిన సైజుల్లో కోసి లేదా పొరలా చీల్చి, వాటిని అతికిస్తూ చెక్కుతూ కోరిన రూపం వచ్చేలా చేస్తారు.





### పెళ్లి వేడుకల్లో..

ఈ కళారూపాలను తయారు చేసేవారిని 'మాలక్కార్' అంటారు. అంటే మాల కట్టేవాళ్లని అర్థం. అత్యంత పురాతనమైందీ కళ. ఈ మొక్క కాండం తెల్లగా ఉండటంతో దీంతో చేసిన నగల్నీ, కిరీటాలను శుభకార్యాలకు, పండగల సమయంలో వాడతారు. ముఖ్యంగా బెంగాలీ పెళ్లి వేడుకలో వధూవరులు ధరించే టోపార్, ముకుత్ అనే కిరీటాలు దీనితోనే తయారవుతాయి. ఇటీవల ఇంటీరియర్ డిజైనింగ్‌లోనూ వీటి అందాలను వాడకం పెరిగింది. ఎండుపూలని సైతం షోలాపిత్‌తోనే తయారు చేస్తున్నారు.

### పౌరాణిక కథ

ఈ మొక్కల వెనుక ఓ పౌరాణిక కథ ప్రచారంలో ఉంది. ఒకసారి శివుడు విశ్వకర్మతో తన వివాహ వేడుకలో ధరించేందుకు స్వచ్ఛమైన ధవళ వర్ణంలో మెరిసే పూలమాలని, కిరీటాన్నీ తయారు చేసివ్వాలని కోరగా– అతను చేయలేకపోయారట.

అప్పుడు శివుడు తన తలలోని వెంట్రుకల్ని తీసి అక్కడే ఉన్న సరస్సులో పాతగా దాని నుండి ఓ ప్రత్యేకమైన మొక్క వచ్చింది. దాన్ని పీకి విశ్వకర్మకి ఇచ్చి మాల తయారు చేయమన్నాడట. అప్పటికీ అతనికి దాంతో ఏం చేయాలో తెలియలేదు. అప్పుడు శివుడు తన చేతి మీద ఉన్న వెంట్రుకలను కొలనులో వేయగా ఓ యువకుడు పుట్టాడట. అతను ఆ తెల్లని కాండంతో పరమేశ్వరుడికి కిరీటాన్ని, మాలని తయారు చేసిచ్చాడట. ఆ వ్యక్తికి 'మాలక్కార్' అని శివుడే పేరు పెట్టాడని అంటారు. కనుకనే ఎంతో పవిత్రమైందిగా భావించే ఈ మొక్క బెండుతో చేసిన కిరీటాన్ని బెంగాలీయులు పెళ్లిలో ధరిస్తుంటారు. ఒడిశాలో రథయాత్ర సమయంలో జగన్నాథుడికి పెట్టే కిరీటాన్ని దీంతోనే తయారు చేస్తారట.





కొందరు ఈ కళ మొఘల్స్ కాలం నాటిదని అంటారు. అప్పట్లో పాలరాయి లేదా ఏనుగు దంతాలతో చేసే కళారూపాలు సంపన్నులకే పరిమితంగా ఉండేవి. ఆ సమయంలో అంతే స్వచ్ఛమైన తెలుపుతో మెరిసే షోలాపిత్ స్థానిక కళాకారుల్ని ఆకర్షించింది. దాంతో తక్కువ ధరలో దొరికే షోలాపిత్‌తో విగ్రహాలను, పల్లకీలను తయారు చేయడం ప్రారంభించారు. ఆ తరువాత ఏనుగు దంతాలను సేకరించడం చట్ట వ్యతిరేకం కావడంతో దానికి ప్రత్యామ్నాయంగా ఈ చెక్కతో కళాత్మక వస్తువులను రూపొందించడం పెరిగింది. అందుకే వీటిని దూరం నుంచి చూస్తే పాలరాయి లేదా ఏనుగు దంతంతో చేసినవని అనుకుంటారు. కాలక్రమంలో వీటి రంగు గోధుమ రంగులోకి మారుతుంది. కానీ గాజు ఫ్రేముల్లో భద్రపరిస్తే ఎప్పటికీ అలాగే నిలిచి ఉంటుందని అంటారు. ప్లాస్టిక్ పూలను బదులుగా షోలాపిత్ పూలను అలంకరించినా, నిమజ్జనం వేడుకల్లో ఈ కాండంతో చేసిన దేవతారూపాలను నీళ్లలో కలిపినా పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లదు.







కథ

# రెండు కళ్లు

ఆ రాజ్యంలో కరోటి అన్న వింత వ్యాధి ప్రవేశించింది. కరోటి అన్న సూక్ష్మక్రిమి వల్ల ముఖ్యంగా చిన్న పిల్లలకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఏర్పడసాగాయి. వైద్య పండితుల సలహాపైన గురుకుల పాఠశాలలన్నీ మూసివేశారు. కొంత కాలం వరకు చిన్న పిల్లలను ఇల్లు దాటి బయటకు పంపకూడదని వైద్యులు ఆదేశించారు.

ఒక సంవత్సరం కాలం గడిచాక కరోటి వ్యాధి సమస్య క్రమ క్రమంగా తగ్గడం ప్రారంభించింది. మరొక సంవత్సర కాలం పాటు రాజ్యంలోని పాఠశాలలన్నిటికీ సెలవు ప్రకటించడం ముఖ్యమని వైద్య పండితులు చెప్పారు.

"ఇలాగైతే పిల్లల భవిష్యత్తు పూర్తిగా దెబ్బతినడానికి అవకాశముంది" చెప్పాడు మహారాజు.

"మహారాజా, ఆ పిల్లల భవిష్యత్తు దెబ్బతినకుండా ప్రయత్నిస్తాను" అన్నాడు మంత్రి.

...



ఆ రోజు ఉదయం తలుపులు తెరచిన జయరామయ్య ఎదురుగానున్న గురుకుల ఆశ్రమ గురువు వెంకట శర్మను, ఆ రాజ్యపు సైనికాధ్యక్షుడు విక్రమసేనుడుని చూసి సాదరంగా ఆహ్వానించాడు.

ఒక సంవత్సరానికి మరింత లావుగా జయరామయ్య కుమారుడు చంద్రయ్యను చూడగానే వెంకటశర్మ బాధపడ్డాడు.

"చంద్రయ్యా, మన రాజ్యంలోని ఖజానా నుంచి ఎక్కువ సొమ్ము ఎందుకు ఖర్చు పెడుతున్నామో తెలుసా?" అడిగాడు విక్రమసేనుడు.

"సైనికులకు, యుద్ధానికి ఉపయోగపడే ఆయుధాల ఉత్పత్తికోసమని మా గురువుగారు చెప్పారు" అన్నాడు.

"యుద్ధం జరగకున్నా, సైనికుల కోసం ఇంత కాలం మనం అనవసరంగా ఖర్చు పెట్టించామనుకొంటున్నారా?" అడిగాడు విక్రమసేనుడు.

ఎలా చెప్పాలో అర్థంకాక బిత్తరచూపులు చూడసాగాడు చంద్రయ్య.

"యుద్ధంలో గెలవాలంటే మంచి ఆయుధాలు, తర్ఫీదు పొందిన సైనికులు కూడా చాలా ముఖ్యం. రాజ్యంలో సైనికులు, ఆయుధాలు లేవని తెలిస్తే పొరుగు రాజ్యంవారు వెంటనే యుద్ధం చేస్తారు" అన్నాడు సైనికాధికారి.

"చంద్రయ్యా, రాజ్యం భవిష్యత్తుకు సైనికులు, ఆయుధాలు రెండు కళ్లలాంటివారు. అలాగే మీ భవిష్యత్తుకు చదువు, ఆరోగ్యం రెండు కళ్ల లాంటివి. కరోటి అనే వింత వ్యాధి నుంచి కాపాడుకోవడం కోసం పాఠశాలలు మూసివేయాల్సి వచ్చింది. మీరేమో ఇంట్లో వుంటూ మీకు రెండు కళ్లలాంటి ఆరోగ్యం, చదువును విస్మరిస్తున్నారు. శారీరక ఆటలు లేక మీరంతా లావుగా అయ్యారు. మరికొన్ని రోజులకు మీ ఆరోగ్యం దెబ్బ తినడానికి అవకాశం వుంది. మీకు పాఠశాలలో నేర్పించిన యోగాసనాలు ఇంటిపట్టునే వుండి చేయాలన్న ఆలోచన ఎందుకు కలగలేదు. మీరు చదువుకోవాల్సిన గ్రంథాలు మేమే ఇంటికి తెచ్చి ఇస్తాం" అన్నాడు వెంకటశర్మ.

మంత్రి ఆజ్ఞానుసారం గురుకుల పాఠశాలలో గురువులు సైనికులతో కలిసి ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లి రెండు కళ్ల లాంటి ఆరోగ్యం, విద్యను విస్మరించవద్దని సలహా ఇచ్చి వెళ్లారు.

ఆ తరువాత విద్యార్థులలో మార్పు వచ్చింది. వేగుల ద్వారా విద్యార్థుల పరిస్థితి తెలుసుకున్న మహారాజు మంత్రి ఆలోచనను మెచ్చుకున్నారు.

**- ఓట్ర ప్రకాష్‌రావు**

వార్త ఆదివారం

## బాలగేయం

### హలం-కలం



హలం దున్నే రైతన్న
కలం పట్టి రాయన్న
అలుకు మొలకలను
అక్షరాలుగా మార్చన్న
పొలం బడిలో రాజోలె
అక్షర సేద్యం చేయన్న
కష్టనష్టాలు ఎదురైనా
వెన్ను చూపక
ఓ అన్న
ఆరుగాలం పంట
కోసం
అహోరాత్రులు
చదువన్న
మధుర పద్యాల
పొలంలో
మణిదీపమై
వెలుగన్న
రాజోలె జగతిపై
ఎగురన్న

- దుర్గమ్ భైతి

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

- ఎస్.ప్రదీప్, మణికొండ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వాన పడేముందు మబ్బులు నల్లగా ఎందుకు ఉంటాయి?

**జవాబు:** ప్రదీప్! వర్షం పడేముందు మబ్బులు ఎక్కువగా సూర్యకాంతిని గ్రహిస్తాయి. అందువల్ల అవి నల్లగా మారతాయి. చిన్న చిన్న నీటి బిందువులతో మబ్బులు ఏర్పడతాయి కదా. వీటి మీద కాంతి ప్రసరించినప్పుడు ఆ బిందువులు పరావర్తనం చెందుతాయి. అందువల్ల మబ్బులు తెల్లగా కనిపిస్తాయి. వాన పడే ముందు నీటి బిందువుల సంఖ్య పెరుగుతుంది. అందువల్ల కాంతి అధికంగా పరావర్తనం చెందదు. ఈ దృష్ట్యా వాన పడేముందు మబ్బులు నల్లగా కనిపిస్తాయి.

- మణికంఠ, నాందేడ్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. పురుగుల ద్వారా 'లక్క' వస్తుందంటారు? నిజమేనా?

**జవాబు:** మణికంఠ! లక్క శాస్త్రీయ నామం Butea Monosperma. దీనినే మనం అగ్నిపూలు, మోదుగ, పలాశ అనే చెట్ల మీద ఏర్పడే వాటిని లక్క గూళ్లని అంటాం. అడవులలో పెరిగే చెట్ల కొమ్మల మీద Kerr (Kerria lacca) అనే చిన్న పురుగు తన పునరుత్పత్తి ప్రక్రియలో ఏర్పరచే జిగురు పదార్థం బాగా ఎండినప్పుడు గట్టి పదార్థంగా మారుతుంది. లక్క స్రవించే విధానాన్ని అనుసరించి శాస్త్రీయ నామం ఏర్పడింది. ఆ పురుగుపేరును అనుసరించి, ఈ గట్టి పదార్థానికి 'లక్క' నామకరణం జరిగింది. ఈ జాతికి చెందిన ఆడపురుగులు సంవత్సరంలో రెండు సార్లు సంపర్కం జరిగినప్పుడు ఈ జిగురు పదార్థాన్ని స్రవిస్తాయి. అడవుల్లోని గిరిజనులు, ఈ లక్క గుళ్లను అమ్మగా, వ్యాపారస్తులు దీనిని శుద్ధి చేసి– లక్క ఉత్పత్తులను విక్రయిస్తారు. గిరిజనులు సేకరించిన ముడి లక్కలో డెబ్బై శాతం వరకు లక్క రెజిన్, పది శాతం వరకు మైనం ఉంటాయి. మన రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లాలో దీనిఉత్పత్తి అధికంగా ఉంది.



# అమ్మ కడుపులో..

**ఆ** ఇల్లు అట్లాగే ఉంది
మన చిన్నప్పట్ణించి
అది ఇప్పటికీ అలాగే
మూలుగుతూ ఉంది.
ఎన్నో కథలు విప్పింది..
చెప్పింది
అది ఒక నమూనా ఒక
కళాఖండం
మన అందరి
మనస్సారభంలో..
ఒక్కో మూల ఒక్కో కథ
ఒక్కో వస్తువు ఆ ఇంట్లో
ఒక్కో జ్ఞాపిక
ఇంకెన్నాళ్లుంటుందో
మనం పోయేవరకు
ఒకానొక రోజు
పాడుబడుతుందేమో
కొన్నాళ్లకు ఆనవాళ్లు కూడా
లేకుండా పోతాయేమో
లేదా కొత్త భవంతవుతుందేమో
మనందరికీ మనవైన ఈ గాథలు
జీవితాంతం ఒక చల్లని కౌగిలి ఇల్లు
వంటింట్లోని వాసనలు
ప్రార్థనా మందిరంలోనివి మరిన్ని
కొన్ని చెక్కలు తాళ్ల సంచులు
డబ్బాలు..
దండెం మీద ఆటక మీద
డాబా మీద
ఎన్నెన్నో సంగతులు
దూరం నుంచి
చూసుకుంటే
గమ్మత్తుగా ఉంటుంది.
లోపలుంటే అమ్మ
కడుపులో ఉన్నట్టు
మనల్ని పెంచి రక్షించి
మమేకమై..
మనలాగే అదీ.. పలుకుతూ ఉంటుంది
పలవరిస్తూ ఉంటుంది
మన మందిలో హృదిలో
సర్వస్వంగా శాశ్వతంగా నిలిచిపోయి
అమ్మతో పాటు అమ్మలాగే జ్ఞప్తికొస్తుంది
చివరికి ఆ ఇంట్లో ఉంటే చాలు
అంటుంది దేహం.
దేశ దేశాలు ఎన్ని తిరిగినా
వెతుక్కుంటుంది ఇంటిని మళ్లా
తవ్వుకుంటుంది బాల్యాన్ని తడితో.


**- రఘు వగ్గు**

---

నేను... నేనే
అబద్ధాన్ని నేను
నిజాన్ని చూపుకోలేని
అసమర్థుడగా...
నిజాన్ని నేనే
అబద్ధం చెప్పలేని
అమాయకుడిగా
...
ఒంటరిని నేను
నీతో కలిసున్నా
ఏమి లేనివాడిగా.
ఏకాంతం నేనే
నాలో నీవున్నా
ఎంతో చీకటిగా
...
వర్తమానం నేను
బతుకును అంకితం చేస్తూ
జీవితాన్ని వీలు వ్రాస్తూ...
భవిష్యత్ నేనే
ఊహించిన వర్తమానాన్ని
ఊపిరిగా అడుగులేస్తూ..
...
ఖాళీ చేతులల్లో
క్షణం తీరిక లేని
నడక నేను.
నిండు హృదయంలో
నిమిషం వృధా చేయని
తలపు నేనే.

**- శ్రీసాహితి**





# చెలి.. మె.

ఈ వారం కవిత్వం

**ఎద** తోడుతాను
ఊటలా మెల్లగా వస్తావు.
స్వచ్ఛమైన నీ మోములో
నన్ను మరోసారి చూసుకుంటాను.
చల్లని నీ స్పర్శతో
గాయాలన్నీ మానుతాయి.
దోసెడు జ్ఞాపకాలతో
మళ్లీ నేను బతుకుతాను.
మురిపాలన్నీ మూట కట్టుకుని
మరింత ముందుకు సాగుతాను.

**- దాసరి మోహన్**

# పప్పుతో విభిన్నమైన రుచులు

## పార్సీ దాల్

**కావలసిన పదార్థాలు**

కందిపప్పు: కప్పు; ఉప్పు: తగినంత; పసుపు: అర స్పూను; ఉల్లిపాయ: ఒకటి; టమాట: ఒకటి; నెయ్యి: రెండు టేబుల్‌స్పూన్లు; కొత్తిమీర: రెండు కొద్దిగా; జీలకర్ర: ఒక స్పూను; ఆవాలు: ఒక స్పూను.



**మసాలా కోసం**

కొత్తిమీర తరుగు: రెండు టేబుల్ స్పూన్లు; పచ్చిమిర్చి: రెండు; అల్లం: చిన్న ముక్క; వెల్లుల్లి రెబ్బలు: ఆరు; ఎండుమిర్చి: రెండు; జీలకర్ర: ఒక చెంచా; దనియాలు: టేబుల్ స్పూను; దాల్చిన చెక్క: చిన్న ముక్క; లవంగాలు: రెండు; మిరియాలు: అర స్పూను; గసగసాలు: ఒక స్పూను.

**తయారు చేసే విధానం**

మసాలా కోసం పెట్టుకున్న పదార్థాలన్నింటినీ మిక్సీలో వేసి మెత్తని పేస్టులా చేసుకుని రెడీగా పెట్టుకోవాలి. స్టౌమీద కుక్కర్‌ని పెట్టి చెంచా నెయ్యి వేసి ఉల్లిపాయ ముక్కలు, టమాట ముక్కలు వేయించుకోవాలి. టమాటముక్కలు మగ్గుతున్నప్పుడు ముందుగా చేసి పెట్టుకున్న మసాలా, పసుపు, తగినంత ఉప్పు, కందిపప్పు వేసి, సరిపడా నీళ్లు పోసి మూత పెట్టాలి. నాలుగు కూతలు వచ్చాక దింపేయాలి. ఇప్పుడు స్టౌ మీద కడాయి పెట్టి మిగిలిన నెయ్యి వేసి ఆవాలు, జీలకర్ర వేయించి పప్పులో వేయాలి. తరువాత కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపాలి.



## గుమ్మడికాయ పప్పు

**కావలసిన పదార్థాలు**

కందిపప్పు: ముప్పావు కప్పు; తీపి గుమ్మడి ముక్కలు: ఒకటిన్నర కప్పు; టమాటలు: రెండు; నెయ్యి: జీలకర్ర: అర చెంచా; అల్లంతరుగు: ఒక చెంచా; పచ్చిమిర్చి: ఒకటి; కారం: చెంచా; పసుపు: పావు స్పూను; ఉప్పు: తగినంత; గరంమసాల: అర చెంచా; కస్తూరీమేథీ: చెంచా; బెల్లంతరుగు: చెంచా; కొత్తిమీర: ఒక కట్ట; నిమ్మరసం: రెండు చెంచాలు.

**తయారు చేసే విధానం**

ముందుగా కందిపప్పును కుక్కర్‌లో వేసి సరిపడా నీళ్లు పోసి, మూత పెట్టి మూడు కూతలు వచ్చేవరకు ఉడికించాలి. స్టౌ మీద బాణలి పెట్టి నెయ్యి వేసి



జీలకర్ర వేయించి అల్లంతరుగు, కరివేపాకు, పచ్చిమిర్చిముక్కలు, టమాట ముక్కలు, గుమ్మడిముక్కలు వేసి వేయించి పావుకప్పు నీళ్లు పోయాలి. ఒక నిమిషం తరువాత ఉప్పు, పసుపు, కారం, గరంమసాలా వేయాలి. గుమ్మడిముక్కలు మెత్తగా అయ్యాక ఉడికించి పెట్టుకున్న పప్పు, కస్తూరీమేథీ, కొత్తిమీర తరుగు, నిమ్మరసం, బెల్లంతరుగు వేసి బాగా కలిపి పప్పు బాగా ఉడుకుతున్నప్పుడు దింపాలి.



## పెసలతో..

**కావలసిన పదార్థాలు**

పెసలు: కప్పు; వెల్లుల్లి రెబ్బలు: నాలుగు; జీలకర్ర: ఒక చెంచా; ఉల్లిపాయ: ఒకటి; టమాట: ఒకటి; టమాట పేస్టు: రెండు టేబుల్‌స్పూన్లు; కొబ్బరిపాలు: ఒకటిన్నర కప్పు; మిరియాల పొడి: అర చెంచా; గరంమసాలా: చెంచా; పసుపు: కొద్దిగా; కొత్తమీర: ఒక కట్ట; ఉప్పు: తగినంత; నూనె: రెండు టేబుల్ స్పూన్లు; పచ్చిమిర్చి: రెండు; కారం: ఒక స్పూను.

**తయారు చేసే విధానం**

పెసలను నాలుగు గంటల ముందు నానబెట్టుకోవాలి. ఆ తరువాత పెసలు, వెల్లుల్లి, జీలకర్ర కుక్కర్‌లో వేసి, సరిపడా నీళ్లు పోసి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించి తీసుకోవాలి.

స్టౌ మీద కడాయి పెట్టి నూనె వేసి ఉల్లిపాయ, టమాట ముక్కలు, పచ్చిమిర్చి తరుగు వేసి బాగా వేయించాలి.

తరువాత ఇందులో టమాటపేస్టు, పసుపు, గరంమసాల, మిరియాల పొడి, తగినంత ఉప్పు, కారం వేసి బాగా కలపాలి.

టమాటముక్కలు మెత్తగా అయ్యాక ఉడికించి పెట్టుకున్న పెసలను వేసి పావుకప్పు నీళ్లు పోయాలి.

పప్పు ఉడుకుతున్నప్పుడు కొబ్బరిపాలు, కొత్తమీర తరుగు వేసి స్టౌని సిమ్‌లో పెట్టి పప్పు బాగా ఉడికాక దింపాలి. ❐

# ఊరిమట్టి

కథ

ఆర్.సి. కృష్ణస్వామి రాజు

చెన్నైలోని అభిరామపురం ప్రాంతంలో ఆరు అంతస్తుల అపార్ట్‌మెంట్ అది. బాల్కనీలోని ఈజీచైర్‌లో కూర్చుని దూరంగా ఉన్న కొబ్బరిచెట్టు వైపే చూస్తున్నాడు చెంగల్రాజు.

అమెరికా నుంచి కొడుకు ఉమాశంకర్ ఫోన్. "నాన్నా, వచ్చే వారం ఆఫీసు పని మీద ఇండియా వస్తున్నాను. నిన్ను కచ్చితంగా ఈసారి అమెరికా తీసుకువెళ్తాను. అమెరికా వచ్చి, మూడు నెలలు మనవరాళ్లతో కలసి ఆడి, పాడి వెళ్లు నాన్నా. ఒంటరిగా చెన్నైలో కూర్చుని ఏమి చేస్తావు? ఎలాగూ పాస్‌పోర్ట్, వీసా సిద్ధంగా ఉన్నాయి. నీ పెద్ద మనవరాలు ఈ మధ్యనే పుష్పవతి అయ్యింది. అమెరికా వచ్చి తాతగా ఆశీర్వాదం చేసి వెళ్లు నాన్నా".

నాన్న అవుననలేదు, కాదనలేదు.


...

ఎయిర్‌పోర్ట్ నుంచి వచ్చిన కారు ఆగిన శబ్దం వినబడింది. కొద్దిసేపటికి శంకర్ ఇంటితలుపు తీసి లోపలికి వచ్చిన అలికిడి వచ్చింది.

సోఫాలో కూర్చుని పాత డైరీలు తిరగవేస్తున్న నాన్న "శంకర్.. అమెరికా వెళ్లే ముందు మన ఊరికి పోవాలని ఉందిరా"

"మీరు మన ఊరు కార్వేటి నగరం వదలిపెట్టి నలభై ఏండ్లు దాటింది. ఊరు రూపురేఖలే మారిపోయి ఉంటుంది. మీ తరం మనుషులు అంతా కాలగర్భంలో కలిసిపోయి ఉంటారు. కలిసి చదువుకున్న స్నేహితులు ఎవ్వరితోనూ సంబంధాలు లేవు. బంధువులంతా ఆ ఊరు విడిచి పెట్టి ఎక్కడెక్కడో స్థిరపడిపోయారు. అక్కడికెళ్లి ఏమి చేయాలని?" నాన్న పక్కనే కూర్చుని అభిమానంగా తండ్రి చేతిని తడుతూ అడిగాడు.

"నిజమేరా.. ఆంధ్రలో టీచర్ ట్రైనింగ్ చేసి తమిళనాడు రాష్ట్రంలో టీచర్ ఉద్యోగం సంపాదించుకున్నాను. ఇక్కడే పెండ్లి చేసుకుని చెన్నై సిటీలోనే స్థిరపడిపోయాను. కానీ ఎందుకోరా, చాన్నాళ్లుగా పుట్టి పెరిగిన ఊరు వెళ్లి రావాలని ఉంది. ఈ ఎనభై ఏళ్ల వయసులో నేను ఒక్కడినే వెళ్లి రాలేను. సాఫ్ట్ ఇంజినీరుగా పని చేస్తున్న నీకు ఎన్నో పనుల ఒత్తిడులు ఉంటాయని తెలుసు. ఒక ఆదివారంనాడు వెళ్లివద్దాం, వంద మైళ్ల దూరమే కదా. తెల్లారి వెళ్లి రాత్రికి వచ్చేయవచ్చు. నా మాటను కాదనవద్దు" దీనంగా అడిగాడు. నాన్న ఆశపడి



అడిగింది ఎందుకు కాదనాలని, కళ్లల్లో కళ్లు పెట్టి "అలాగే నాన్నా" అన్నాడు. కొడుకు అవునన్నదానికి నాన్న కళ్ల ఆనంద భాష్పాలు రాల్చాయి.

...

ఒక ఆదివారం ఉదయం- కోళ్లు కూయక ముందే వారు చెన్నై నుండి బయలుదేరి చిత్తూరు జిల్లాలోని మండల కేంద్రమైన కార్వేటి నగరం చేరారు. చోళ రాజుల పరంపరలో వచ్చిన కార్వేటినగరం రాజుల పరిపాలనలో ఎంతో వైభవాన్ని చూసిన గ్రామమది.

ఊరి నడిబొడ్డున ఉన్న గాండ్ల మిట్ట కూడలి వద్ద కారును పార్క్ చేసారు. తెల్ల పంచె, తెల్ల చొక్కా, తెల్ల తువ్వాలు వేసిన ఆజానుబాహుడైన నాన్న, ముందు నడుస్తుంటే శంకర్ నాన్ననే అనుసరిస్తున్నారు. ఎనిమిది పదుల వయస్సు నిండిన వాడైనా, స్వంత ఊరికి వచ్చామని కాబోలు.. జింకలెక్కన పరుగులు తీస్తూ నడుస్తున్నాడు. అతడి పరుగు నడకను అందుకోవడానికి శంకర్ చాలా చెమటచుక్కలు రాల్చాల్సి వచ్చింది.

మొదట రాజావారు రెండు శతాబ్దాల క్రితం కట్టిన పుష్కరిణి వద్దకు వెళ్లారు. పదమూడు ఎకరాలలో నిర్మితమైన రాతిమెట్లు కలిగిన సుందరమైన కట్టడం అది. దీర్ఘ చతురస్రాకారంలో ఉన్న పుష్కరిణి రాతి మెట్లు గీతలు గీచినట్లుగా చక్కగా ఉన్నాయి. కొలను నిండా తామరాకులు పచ్చగా మిలమిలా మెరుస్తున్నాయి. గాలికి నీళ్లు తామరాకుల మీద పడి ఆకుల మీద నిలబడలేక అటూ ఇటూ ఊగి పుష్కరిణిలోకి జారి పడుతున్నాయి. ఆకుల మీద కొద్దిసేపు నిలబడిన నీళ్లు సూర్యకిరణాలకు ముత్యాల మాదిరి మిలమిలా మెరుస్తున్నాయి. ఆకాశంలో నక్షత్రాల లాగా పుష్కరిణిలో అక్కడక్కడా తెల్లటి తామరపూలు చూడముచ్చటగా వున్నాయి.

నాన్న కన్నార్పకుండా వాటినే చూసాడు. తేటగా కొబ్బరినీళ్లలా ఉన్న పుష్కరిణి నీళ్లను దోసిళ్లలో ఎత్తుకుని అమృతం లెక్కన కడుపారా తాగాడు.

ఖాళీగా కూర్చోలేని శంకర్ పుష్కరిణిలోని చేపనొకదానిని తీసి మెట్ల మీద వేసాడు. అది గిలగిలా కొట్టుకుంటోంది. నాన్న గబగబా వచ్చి చేపని నీళ్లలో పడేసి "పుట్టి పెరిగిన ఊరిమట్టి తగిలితే మనిషికి పోగొట్టుకున్న ప్రాణశక్తి పొందినట్లు అవుతుంది. చేపకు నీళ్లు కూడా అంతేరా. వాటికి ప్రాణశక్తి లేకుండా చేయవద్దు" అని గట్టిగా అరిచి చెప్పాడు.

అక్కడి నుండి లేచి వచ్చేటప్పుడు నాన్న తన చేతిలోని బిస్‌లెరి వాటర్‌బాటిల్‌లోని నీళ్లను కింద పారబోసాడు. అందులోకి పుష్కరిణిలోని నీళ్ల పట్టుకుంటూ "చెన్నైలో ఇంత మంచినీరు మనకి ఎక్కడ దొరుకుతుంది" అన్నాడు.

నాన్నను చూస్తూ శంకర్ "వయసు పైబడిన పెద్దోళ్లు, పిల్లోల్లు అయిపోతారని చెబుతారు. నిజమేనేమో" అనుకుంటూ చిన్న నవ్వు నవ్వి ఊరుకున్నాడు.

పనిలో పనిగా రాజ వీధిలో నడిచారు. నాన్నకి తను చిన్నప్పుడు ఆ వీధిలో కాగితపు విమానాలు విసిరింది గుర్తుకొచ్చింది. పాడుబడిన రాజ భవనాల గోడల మీద పిల్లలు పిచ్చిగీతలు గీసి ఉన్నారు. తన పైగుడ్డ తీసి వాటిని తుడవాలని ప్రయత్నించాడు. గుడ్డకు మురికి అయ్యింది తప్పితే గీతలు మాసిపోలేదు.

రాజావారి దర్బారు మందిరం వద్దకు వెళ్లారు. దర్బారు మందిరం స్థానంలో బడి కట్టి ఉన్నారు. దానికి ఎదురుగా నిలబడి రెండు చేతులెత్తి నమస్కరించాడు. అక్కడే ఆటలాడుకుంటున్న బడిపిల్లలు పెద్దాయన చేసే నమస్కారాన్ని వింతగా చూసారు.

అలాగే వేణుగోపాల స్వామివారి దేవాలయం వెళ్లి శ్రీకృష్ణుడి దర్శనం చేసుకున్నారు. గుడి ప్రాంగణంలోనే కూర్చున్న నాన్న శ్రీకృష్ణునిపై అన్నమయ్య రచించిన "ఇందిరా రమణుతెచ్చి ఇయ్యరో మాకిటువలె" కీర్తన ఒకటికి రెండు సార్లు పాడినాడు.

చిన్నగా లేచి బయటికి వస్తే చెరుకురసం బండి కనిపించింది. కొనుక్కుని తాగుతూ నాన్న "చెరుకురసం భలే తియ్యగా ఉంది కదా, నగరం చెరుకునాణ్యం ఇంకెక్కడా ఉండదురబ్బా" అన్నాడు.

"నాన్నా, నీకు పిచ్చి కాకపోతే ఏ ఊర్లో అయినా చెరుకు రసం తియ్యగానే వుంటుంది. మన ఊరికి అమాసే లేదన్నట్లుగా చెప్తా ఉండావే" అన్నాడు.

"నీ కడుపు చల్లగుండా, నీవు పిల్లోడివి. నీకు లోకం పోకడం తెలియదురా. మన నగరంలో చెరుకు రసం ఉన్నట్లు మరెక్కడా ఉండదని పెద్ద పెద్దోళ్లే చెప్పినారు" అని గొప్పగా చెప్పినాడు.

చెరుకురసం తాగాక, కోట చెరువు బురుజు, లక్ష్మీమహల్, రాణులు స్నానం చేసే అష్ట భుజి బావిలు చూశారు. చివరిగా రాజుల కళ్యాణ మంటపం వద్దకి వెళ్లి అప్పటి అద్భుత నిర్మాణ కౌశల్యం చూస్తూ చీమల పుట్ట పైన నిలబడినాడు.

"నాన్నా, చీమల పుట్ట"

"ఏమీ కాదులేరా, మన ఊరి చీమలు మనల్ని ఎందుకు కరుస్తాయి? కరిసినా మనకి నొప్పి ఎందుకు ఉంటాది?" అన్నాడు.

"చీమలకి మనం చెన్నైలో చేరిపోయినామని తెలుసుకుని కుడితే" అని నవ్వుతూ నాన్నను పుట్ట నుంచి పక్కకి లాగినాడు.

"నాన్నా, చీమల పుట్ట"
"ఏమీ కాదులేరా, మన ఊరి చీమలు మనల్ని ఎందుకు కరుస్తాయి? కరిసినా మనకి నొప్పి ఎందుకు ఉంటాది?"

చిన్నగా తాము ఉన్న పడమటి వీధికెళ్లారు. అక్కడ వారి ఇల్లే కాదు, చుట్టుపక్కల ఇండ్లు కూడా లేవు. అంతా బీడు పడిన నేలలా ఉంది. ముళ్లకంపల చెట్లు దండిగా మొలిచి ఉన్నాయి. తను కూర్చుని చదువుకునే చోటికి వెళ్లాడు. అక్కడ నాలుగు అడుగుల ఉస్తికాయ చెట్టు ఉంది. గుండ్రటి పచ్చ రంగులో ఉస్తికాయలు గుత్తులు గుత్తులుగా వేలాడుతున్నాయి. చేసేదేమీ లేక చిన్నగా చెట్టును తట్టాడు. తెలుపు రంగులో ఉన్న ఉస్తిపూలు పలపల రాలాయి.

తెలిసినవారెవరైనా కనిపిస్తారేమోనని అన్ని దిక్కులూ చేసాడు. దరిదాపుల్లో ఎవ్వరూ కనిపించలేదు. ఎప్పుడూ ఇంటి చుట్టూ తిరుగులాడే కిష్టమండడి, కొల్లాగుంట కమలక్క, గొర్రెల మండీ మౌలా గుర్తుకొచ్చారు. ఎక్కడ ఉన్నారో.. ఏమైనారో..

"గువ్వలకు బువ్వ లేకుంటే ఎలా అని ఇంటి వసారాలో నాన్న కట్టే వరికుచ్చులు గుర్తుకొచ్చాయి. బిలబిలమంటూ పిచ్చుకలు, పావురాలు, ఉడుతలు వచ్చి గింజలు తిని పోతుంటే ఎంత బాగుండేదో" అని అనుకుంటుండగా అక్కడికి పందుల గుంపు ఒకటి వచ్చింది. వీధికుక్కలన్నీ దూరంగా నిలబడి 'భౌ.. భౌ' అని అరిచాయి. పందులన్నీ 'పోలో'మని పరుగులు తీసాయి. ఒక్క పంది పిల్ల మాత్రం మిగిలింది. కుక్కలన్నీ ఒంటరిగా దొరికిన పందిపిల్ల దగ్గరికి వెళ్లి దానిని తరిమింది తరిమిందే...

దేముడిగది ఉన్న చోట మెజింతా రంగు కాగితం పూలచెట్టు కనిపించింది. చెట్టు పట్టుకుని ఊగించాడు. ఇద్దరి మీదా పూల వర్షం కురిసింది.

నాన్న ముసిముసి నవ్వులు నవ్వుతూ "ఈ మట్టిలో దొర్లాడాలని ఉందిరా శంకర్" అన్నాడు.

"ఈ ఊర్లో ఏముంది నాన్నా" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏ ఊర్లో ఏముంది నాన్నా?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏఊర్లో మాత్రం ఏముంటుందిరా శంకర్? మనిషికి తను పుట్టి పెరిగిన పుడమితల్లితో పెంచుకున్న అనురాగం, పంచుకున్న అనుభవాలు, అల్లుకున్న ఆప్యాయతలు అతడిని కట్టిపడేస్తాయి. పుట్టి పెరిగిన ఊరంటే అమ్మ తర్వాత అమ్మ. ఊరంటే తొలి చిరునామా" అని గంభీరంగా బదులిచ్చాడు.

...

ఊరు అంతా తిరగడం పూర్తి అయ్యింది. కారు పార్కింగ్ చేసి ఉన్న గాండ్లమిట్ట వద్దకు చేరారు.

చల్లటి గాలి తెరలు తెరలుగా వీస్తోంది.

"భలే వస్తా వుంది కదా గాలి" అన్నాడు.

"మనం ఊరికి మిట్టగా ఉండే చోట ఉన్నాం కాబట్టి మంచి గాలి వస్తా ఉంది"

"ఏమైనా మన ఊరి గాలి మాదిరి ఎక్కడా ఉండదురబ్బా"

నాన్న మాటలకు శంకర్ చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

ఎప్పుడూ జనంతో కిటకిటలాడే గాండ్లమిట్ట ఆరోజు కూడా జనంతో నిండుకుండలా ఉంది. చిత్తూరు, పుత్తూరు, తిరుపతి, తమిళనాడులోని పల్లిపట్టులకు వెళ్లడానికి కేంద్రమైన గాండ్లమిట్ట కనుల విందుగా కనిపిస్తోంది. తెలిసినవారు ఎవరైనా కనబడతారేమోనని నాన్న చాలాసేపు వెదికాడు. వయసు పైబడినవారి ముఖంలో ముఖం పెట్టి చూసినాడు. తెలిసినవారెవ్వరూ కానరాలేదు.

దారిలో జీవాలను, పశువులను అడవికి తోలుకెల్తున్న పిల్లోడు ఒకడు సరసరా వచ్చి బంకు అంగడి దగ్గర ఆగినాడు. ఆడోళ్లు పెట్టుకునే రంగు రంగుల కుంకుమబొట్టు స్టిక్కర్ ప్యాకెట్ ఒకటి కొన్నాడు. తనకు నచ్చిన జీవాలకు వాటి తలపైన అంటించి పకపక నవ్వుతూ–

"గొర్రె వెనుక గొర్రె
మేక వెనుక మేక
ఎద్దు వెనుక ఎద్దు

వెనుక వెళ్తే ముద్దు.." అని పాడుతూ అడుగులేస్తూ వెళ్తున్నాడు.

పిల్లోడి వయ్యారాలు చూసి పడీ పడీ నవ్వుతూ ఉన్న నాన్నకి, లీలగా గతం గుర్తుకు వచ్చింది.

...

సాయంకాలమైతే అమ్మ బంగారమ్మకి కండ్లు సరిగా కనబడేవి కావు. అందుకని అమ్మను తీసుకుని తమలపాకు, వక్క, పొగాకుచెక్క కొనడానికి గాండ్లమిట్ట వచ్చేవాడు. తోడుగా వచ్చిన దానికి అమ్మ మిఠాయిలు తీసి ఇచ్చేది.

ఒకరోజు మంచి వర్షం కురుస్తోంది. అంగడికి రమ్మని అమ్మ పిలిచింది.



"నేను రాలేనులే అమ్మా, నాకు మనసు బాగా లేదు, నా తలలోని వెంట్రుకలనీ రాలిపోతున్నాయి" అని బాధగా అన్నాడు.

"ఓరి తిక్కలవాడా, తెలివి ఎక్కువైన వాళ్లకి వెంట్రుకలు రాలిపోతాయని నీకు తెలియదా, నీవు దండిగా తెలివి తెచ్చుకుని పెద్ద చదువులు చదివి పెద్ద ఉద్యోగం చేయబోతావు. అందుకే రాలుతున్నాయి" అని బుజ్జగించి తీసుకొచ్చింది.

"హై, హై అంటూ అమ్మ పైటని వానకి అడ్డుగా పెట్టుకుని గాండ్లమిట్టకొచ్చారు.

"మిఠాయిలు తీసుకోరా కొడుకా" అంటే–

"ఎప్పుడూ మిఠాయిలేనా?" అంటూ అంగట్లోని అరటిపండ్ల వైపు చూసాడు.

ఒకటికి రెండు పండ్లు తీసిచ్చింది.

'అబుక్ అబుక్' అని తింటూ వానలో తడుచుకుంటూ ఇల్లు చేరారు.

"అందుకే పెద్దలంటారు.. తండ్రి మంచితనం పర్వతంకంటే ఎత్తైంది, తల్లి మంచితనం సముద్రం కంటే లోతైంది" అని అనుకున్నాడు.

ఎవరో తన ఎడమ చేతిని తాకుతున్నట్లుగా ఉంటే స్పృహలోకి వచ్చి వెనుదిరిగి చూసాడు.

...

తెల్లటి ఆవు, నాలికతో తన చేయి నాకుతోంది.

దాని కళ్లల్లో కళ్లు పెట్టి చూశాడు. ఏదో తెలియని అనుబంధం పెనవేసుకున్నట్లుగా అనిపించింది. అభిమానంగా దాని గంగడోలు తాకాడు. నిగనిగలాడే దాని మోపురం నిమిరాడు.

ఆవు కళ్ల వెంట నీళ్లు కారుతున్నాయి. అతడికి తెలియకనే అతడి కళ్లు కూడా తడి అయ్యాయి.

అక్కడే అరటి పండ్ల బండి ఉండడంతో రెండు పచ్చ అరటిపండ్లు కొన్నాడు. ఆవు నోటికి అందించాడు.

ఆవు ఆబగా అందుకుని తింది. తర్వాత దీనంగా తన తలని అతడి కడుపు ఆనించింది.

ఆప్యాయంగా దాని తలను కౌగిలించుకున్నాడు.

"అతడు ఎవరు? ఆవు ఎక్కడిది? అతడికి, ఆవుకు ఏమిటి సంబంధం? ఎందుకిలా ఆప్యాయంగా చూసుకుంటూ ఉన్నారు? అక్కడి చుట్టుపక్కల జనానికి సమాధానం లేని ప్రశ్నలు.

"నాన్నా, ఇక చెన్నై బయల్దేరుదాం" అని శంకర్ అనడంతో కారెక్కుదామని నడకలేస్తూ ఉంటే ఆవు అతడి వైపు బేలగా చూసింది.

చివరిగా కారు ఒకసారి ఆపమన్నాడు.

ఆవు దగ్గరికి వెళ్లి ఆవుకాళ్లకు నమస్కరించినాడు. ఆవు కాలి గిట్టల కింద ఉన్న మట్టి కొంచెం చేతిలోకి తీసుకున్నాడు. వెనక్కి తిరిగి చూడకుండా వెళ్తుంటే ఆవు మెడలోని గజ్జెల 'ఘల్ ఘల్' శబ్దాలు వారికి లీలగా వినిపించాయి.

నాన్న కళ్లు మూసుకుని కారు వెనుక సీటులో కూర్చున్నాడు. అతడి ఎడమ చేతిలో ఉన్న బాటిల్‌లోని పుష్కరిణి నీళ్లు అటూ ఇటూ కదులుతున్నాయి. కుడి చేతి పిడికిలి నిండా ఊరి మట్టి.

కారు చెన్నై వైపు బయలుదేరింది. ఊరి పొలిమేరలు ఇంకా దాటలేదు. చిన్నగా వర్షం మొదలయ్యింది.

కళ్లు తెరవకనే కారు ఆపమని కోరినాడు నాన్న. కారు అద్దాలు తీసి వర్షానికి వస్తోన్న మట్టివాసన దీర్ఘంగా పీల్చి వదులుతున్నాడు.

నాన్న తన్మయత్వం చూసిన శంకర్ "పుట్టి పెరిగిన ఊరికీ, మనిషికీ మధ్య ఇంత ఆకర్షణ శక్తి ఉంటుందా" అని ఆశ్చర్యపోయాడు. వర్షం ఆగిపోయింది. కారు బయలుదేరుతుంటే నాన్న దిగులు గొంతుతో "ఎన్ని జన్మలెత్తినా, కన్న ఊరు రుణం తీర్చుకోలేం. ఎంత ఎత్తు ఎదిగినా, ప్రపంచమంతా పరుగులు తీసినా, పుట్టి పెరిగిన ఊరితో సమానం కాదు" అని అన్నాడు. సర్రున కారు చెన్నై వైపు దూసుకెళ్లింది. వారం తర్వాత–

అమెరికా ఫ్లైట్ కోసం చెన్నై అన్నా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి లగేజీ ఎత్తుకుని లిఫ్ట్‌లో దిగుతున్నాడు శంకర్. పక్కనే వైట్ అండ్ వైట్ ఆల్వేజ్ రైట్ అన్నట్లు తెల్ల ప్యాంటు, షర్టు, షూ వేసి రేబాన్ కూలింగ్ గ్లాసు వేసిన నాన్న నవ్వుతూ నిలబడి ఉన్నాడు. అతడి ఎడమ చేతిలో పుష్కరిణి నీళ్ల బాటిల్, కుడి చేతిలో చిన్న ప్లాస్టిక్ కవర్‌లో ప్యాక్ చేసి ఉన్న ఊరి మట్టి ఉన్నాయి.

అదే లిఫ్ట్‌లో తల్లితో కలిసి దిగుతున్న ఎదురింటి ఏడాది పాప వచ్చీ రాని పళ్లను బయటికి పెట్టి నవ్వుతూ టాటా చెప్పింది.

## నయాగర..

(ఏడవ పేజీ తరువాయి)

చలికాలంలో కొన్ని సందర్భాలలో అతి పెద్ద రాళ్ల లాంటి మంచుముక్కలు నీటిపై తేలుతూ కనువిందు చేస్తాయి. త్రివర్ణ శోభిత నయాగర కెనడాలోని ఒంటారియో వద్ద ఉన్న నయాగర జలపాతం గతేడాది భారత జెండా రంగులు అద్దుకుంది. ప్రపంచంలోనే అది పెద్ద జలపాతం. తెల్లగా కనిపించే నయాగర కాస్త త్రివర్ణ శోభితంగా మారింది. కరోనాతో తీవ్రంగా సతమతమవుతున్న భారత్‌కు ధైర్యం చెప్పేలా కెనడా అధికారులు ఈ విధంగా నయాగరపై భారత జాతీయ పతాకం రంగులు వచ్చేలా లైటింగ్ వేశారు. కరోనాతో పోరాడుతున్న భారత్‌కు సంఘీభావం తెలిపేందుకు కెనడా ప్రభుత్వం వారు 2021 ఏప్రిల్ 28వ తేదీ రాత్రి 9.30 నుంచి 10 గంటల వరకు అర్ధ గంట పాటు భారత జెండాలోని మూడు రంగులు ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ రంగులు వచ్చేలా లైటింగ్ వేశారు. దీంతో నయాగర త్రివర్ణ శోభితంతో అద్భుతంగా కనిపించింది. కరోనా కష్ట కాలంలో 'దృఢంగా ఉండు భారత్(స్టే స్ట్రాంగ్ ఇండియా)' అంటూ కెనడా ప్రభుత్వం మన దేశానికి సందేశం పంపింది. కరోనా కష్ట కాలంలో దుబాయ్ ప్రభుత్వం సైతం 'భారత్ ధైర్యంగా ఉంటు... కోలుకో' అంటూ సందేశాలు పంపించడమే కాకుండా ప్రపంచంలో ఎత్తయిన దుబాయ్‌వారి నిర్మాణం బూర్జ్ ఖలీఫాపై భారత జెండా రెపరెపలు ఆడించి రాత్రి వేళలో మువ్వన్నెల లైటింగ్ వేసి సంఘీభావం తెలుపుతూ 'భారత్ కోలుకో' అంటూ సందేశం ఇచ్చారు. కరోనా సమయంలో పర్యాటకులు లేక నయాగర జలపాతం వెలవెలబోయింది. ఇప్పుడు కరోనా తగ్గుముఖం పట్టడంతో నయాగరను తిలకించడానికి అనునిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తున్నారు.

**'నిన్న పెళ్లికి వెళ్తానన్నావు కదూ, విందెలా ఉంది?" అనడిగాడు ఒకడు.**

**"ఎలాగుందేదేమిటి.. చారులో ఉప్పు తక్కువ" అన్నాడు ఇంకొకడు.**

**ఇది ఓ మనిషి స్వభావం.**

నెగిటివ్ విషయాలను చూడటం, మాట్లాడటంలో మనిషికి ఆసక్తి ఎక్కువ. విషయమే. అంటే ఎంత మంది మరణించారన్నదే పత్రికకు ముఖ్యం. ఎందుకంటే మనిషి మనసు దానినే గమనిస్తోంది.

ప్రమాదాల వార్తలే పత్రికలలో ఎక్కువగా వస్తుంటాయి. ప్రముఖంగా వస్తుంటాయి. చెడుకే అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. ఇందువల్ల ఏమవుతోందో తెలుసా... ఈ ప్రపంచంలో ఎక్కడ చూసినా దోపిడీలు, ఘర్షణలు, దెబ్బలాటలు, కొట్టుకోవడాలు, పొడుచుకోవడాలు, సంతోషించడానికి అంటూ బోలెడన్ని విషయాలు ఉన్నాయి.

ఓ రోజంతా సంతోషంగా, మంచిగా సాగిపోతుంటుంది. అయితే ఉన్నట్టుండి ఓ అరటిపండు తొక్క మీదు కాలు వేసి జారిపడతాం. దాంతో అప్పటివరకూ సంతోషంగా గడిపిన క్షణాలను పక్కన పెట్టి కింద పడ్డ విషయాన్నే కనిపించిన వారందరికీ చెప్తుంటాం.

నెగిటివ్ విషయాలకు ఇట్టే చేరువైపోతాం. మంచికి ఆమడ దూరంలో ఉంటాం.

# ప్రతికూల భావాలు మానుకోవాలి



చారులో ఉప్పు తక్కువనేది లోటే. కాదనడం లేదు. కానీ సాంబారులో అది సరిగ్గా ఉంది. కూరలో అది సరిగ్గానే ఉంది. అయితే అవన్నీ చెప్పడానికి మనసు రాదు.

ఓ పెద్ద తెల్లటి కాగితం మధ్యలో ఓ చిన్న నల్ల చుక్క పెట్టి అది ఒకరికిచ్చి ఏమిటి? అని అడిగితే నల్ల చుక్క అని ఠకీమని జవాబిస్తాడు.

అంటే అతనికి అంత పెద్ద తెల్లటి కాగితంలో కనిపించింది నల్లటి చుక్క మాత్రమే. ఆ చుక్క చుట్టూ తెల్లటి భాగం ఉన్నప్పటికీ దానిని చెప్పడు, పట్టించుకోడు.

ఓ అద్దం ముందు నిలబడతాం. ముఖం చూసుకుంటాం. కాస్త ఆలోచించండి. ముఖంలో మనకు నచ్చని భాగాన్నే ముందుగా చూస్తాం. దానిమీదే దృష్టి పోతుంది. చెమటకాయ ఉంటే దానిని చూస్తాం. అయితే దాని చుట్టూ ఉన్న అందాన్ని చూడం. ఆ అందమంతా తర్వాతి విషయమే.

అంతెందుకు.. పొద్దున్న ఓ వార్తాపత్రికను తీసుకుంటాం, తిరగేస్తాం.

నేరాలు-ఘోరాలు వంటి వార్తలనే మొదటగా చూస్తాం. చదువుతాం. మిగిలిన మంచి వార్తలన్నీ ఆ తర్వాతే. ఓ పత్రిక అమ్మకానికి కూడా నెగిటివ్ సమాచారమే ముఖ్యమవుతోంది.

ఓ చోట తొక్కిసలాట.. గందరగోళం. ఆ విషయం పత్రికలో ఎలా వస్తోంది. తొక్కిసలాటలో పది మంది బలి అనే వస్తుంది.

అంతేతప్ప ఈ తొక్కిసలాట నుంచి తొమ్మిది వందల మంది ప్రాణాలతో బయట పడ్డారనే విషయం తర్వాత ప్రాణనష్టాలు వంటివే జరుగుతున్నాయని ఓ భ్రమలో ఉంటాం.

ఈ క్రమంలో ప్రపంచంలోని సంతోషాలను, జీవిత సంతోషాలను మరచిపోతున్నాం.

ఈరోజు విమానం కూలి రెండు వందల పధ్నాలుగు మంది దుర్మరణం అనే వార్తకు ఇచ్చే ప్రాధాన్యం.. ఈ రోజు రెండు వేల మంది సుఖసంతోషాలతో విమాన ప్రయాణం చేసారన్న పాజిటివ్ విషయాన్ని పక్కన పెట్టేస్తాం.

మరణించిన విషయమే వార్తగా వస్తుంది. సుఖసంతోషాలతో ఉన్నది బయటికి రాదు, తెలీదు. అది ఎవరికీ అక్కర్లేదు కూడా.

కనుక ఇప్పటికైనా సుఖసంతోషాలకు సంబంధించిన విషయాలపై దృష్టి సారించాలి. ఈ భూమ్మీద అసలు పట్టించుకోం కూడా.

ఈ వైఖరి మారాలి. ప్రతికూల భావాల వల్ల విజయం సాధించడం అనేది కష్టం. సానుకూల భావాలపై దృష్టి కేంద్రీకరించాలి.

ముందుకు అడుగేయాలి.

ఒకే విషయాన్ని కొందరు పాజిటివ్‌గా తీసుకుంటారు. మరికొందరు నెగిటివ్‌గా తీసుకుంటారు.

...

ఓ సత్రంలో ఇద్దరు సాధువులు ఉన్నారు. వారి మాటలో మధ్యలో..

"నాకు భార్య లేదు, అందుకే నేను సాధువునయ్యానం"టాడు.

అయితే మరొకడు "నాకు భార్య ఉంది కనుక నేను సాధువున" య్యానంటాడు.

**- యామిజాల జగదీశ్**






# ఉర్రూతలూగిస్తున్న అబ్దూ ర్యాప్

**అబ్దూ రోజిక్ ర్యాపర్..** అతడు గొంతెత్తి పాట అందుకున్నాడంటే ఎవరైనా ఫిదా కావాల్సిందే. ఈ తజిక్ గాయకుడికి ప్రపంచ వ్యాప్తంగా అభిమానులున్నారు. అప్లోడ్ మీడియాలో అబ్దూ ర్యాప్ గీతాలను ఫాలో అయ్యేవారు ఎంతో మంది ఉన్నారు. ఈ యూట్యూబ్ ఛానల్‌కు నాలుగు లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్స్ ఉన్నారంటే అతడికి ఉన్న క్రేజ్ ఏమిటో అర్థమవుతుంది. సామాన్యులే కాదు సెలబ్రిటీలు కూడా అబ్దూకు అభిమానులే అంటే ఆశ్చర్యం కలుగుతుంది.

**ర్యాపర్ సహకారంతో..**

చూడటానికి పొట్టిగా కనిపించినప్పటికీ అబ్దూకు 19 ఏళ్లు. తజకిస్తాన్ గిష్‌దర్వా అనే చిన్న గ్రామంలో ఒక తోటమాలి కుటుంబంలో 2003లో పుట్టాడు. చిన్నప్పుడు కొన్ని శారీరక రుగ్మతలుండేవి. కొడుక్కి చికిత్స చేయించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో అతడి తల్లిదండ్రులు నిస్సహాయులుగా ఉండిపోయారు. దాంతో అబ్దూకు వయసొచ్చినా శారీరకంగా ఎదగలేదు. 16 ఏళ్ల వయసులో అతడి బరువు కేవలం 12 కిలోలు మాత్రమే. అలాంటి సమయంలో తజిక్ బ్లాగర్, ర్యాపర్ బరోన్ కంటపడ్డాడు ఆ పిల్లాడు. చిన్నప్పుడే అద్భుతంగా పాటలు పాడుతున్న అబ్దూను తనతో పాటు తీసుకెళ్తానని, మంచి గాయకుణ్ణి చేస్తానని అతడి కుటుంబ సభ్యులను ఒప్పించాడు. అలా అబ్దూ సొంతూరు నుంచి దుశాంబే నగరానికి మకాం మార్చాడు. బరోన్ అతడిని తన దగ్గరే ఉంచుకుని ర్యాప్ గీతాల్లోని మెళకువలు నేర్పించాడు. అంతేకాదు.. కొన్ని వైద్య పరీక్షలు కూడా చేయించి 50 సెంటీమీటర్లు పెరిగేలా చేశాడు. బరోన్ నేతృత్వంలో ర్యాప్ గీతాల్లో అబ్దూ రాటుదేలాడు. అతడి గళం విభిన్నంగా ఉండటం, పలు ప్రయోగాలు చేయడంతో అనతి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా పాపులర్ అయ్యాడు.

ప్రపంచంలోనే పొట్టి గాయకుడిగా రికార్డుల్లోకెక్కిన అబ్దూ రోజిక్ ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధ గాయకులతో వేదికలు పంచుకున్నాడు. దుబాయిలో జరిగిన ఒక వేడుకలో సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్‌తో కలిసి కచేరీ చేశాడు. అతడి టాలెంట్‌కు ముగ్ధుడైన రెహమాన్ ఇటీవల తన కూతురు ఖతీజా రెహమాన్ పెళ్లి రిసెప్షన్‌లో అబ్దూకు అవకాశం ఇచ్చాడు. వేదికపై ఉన్న ఈ పొట్టి గాయకుడిని చూసి ఆహుతులు ఆశ్చర్యపోయారు. 'పాపా కహతే మై' పాటను అద్భుతంగా ఆలపిస్తున్న అబ్దూ దగ్గరికి వెళ్లి రెహమాన్ అభినందించారు. ఈ వీడియో వైరల్ కావడంతో అందరి దృష్టి అబ్దూపై పడింది.

ఈ తజిక్ ర్యాపర్ పాటలంటే అరబ్ దేశస్తులకు విపరీతమైన క్రేజ్. అందుకే అక్కడ తరచూ అబ్దూ ప్రదర్శనలను ఏర్పాటు చేస్తుంటారు. తమ దేశాన్ని సందర్శించే అతిథుల్లో కొందరిని ఎంపిక చేసి పరిమితంగా ప్రత్యేకమైన వీసాను ఇస్తుంటుంది యుఏఈ ప్రభుత్వం .... అదే 'గోల్డన్ వీసా'. ఇటీవల అబ్దూకు గోల్డన్ వీసా ఇచ్చి, గౌరవించింది. 'తజకిస్తాన్ నుంచి ఈ అరుదైన గౌరవాన్ని అదుకున్న తొలి వ్యక్తిగా గర్విస్తున్నా. ఇది నా కెరీర్‌లో అత్యున్నతమైంది. రెండు దేశాలు (యుఏఇ, తజకిస్తాన్) గర్వించేలా చేస్తాననే నమ్మకం ఉంది' అంటూ ఆనం దాన్ని వ్యక్తం చేశాడు అబ్దూ. వీసా అందుకునేప్పుడు అరబ్ దుస్తులు ధరించాడతను.

మొత్తానికి ఈ పొట్టివాడు గట్టవాడే' అంటున్నారు అతని పాటలు విన్నవారంతా. ❍

# పైకొచ్చే టా'లెంటు'

బట్టేపాటి జైదాస్

'అట్కిన్ సన్ ఇంటర్నేషనల్ ఇ-టాలెంట్ స్కూల్' ఆకాశాన్నంటుతున్నట్టున్న ఆ స్కూల్ బిల్డింగ్ వాకిట్లో అలా నిలబడిపోయి తల పైకెత్తి తనివితీరా ఓసారి చూసుకుంటున్నాడు చదువుల్రావు.

"వామ్మో ఇంత పెద్ద స్కూలే" అనుకుంటూ కన్నార్పకుండా చూస్తుండగా-

సూర్యకిరణాలు సూటిగా పడటంతో తల తిరిగి తలకిందులుగా పడబోయాడు. కానీ తృటిలో తమాయించుకుని "చూడబోతే ఇదేదో మంచి శకునంలాగే ఉందే. రేపు నా 'సన్' కూడా ఈ 'అట్కిన్సన్'లో చేరి చదువులో 'సన్' లాగే ప్రకాశించబోతున్నా డేమో కాబోలు. అయినా చూద్దాం ఏమవు తుందో.. అనుకుంటూ ముందుకు కదిలేడు.

చదువుల్రావుకు చిన్నప్పటి నుంచి పెద్ద చదువు, అది కూడా అతి పెద్ద కార్పొరేట్ స్కూల్లో, అదీనూ ఇంగ్లీష్ మీడియంలోనే చదవాలని చాలా చాలా కోరిక. కానీ పేదరికం వల్ల కుదరక గవర్నమెంట్ స్కూల్లోనే చదవాల్సి వచ్చింది. ఆ కసితో అప్పుడే గట్టిగా నిర్ణయించుకున్నాడు.

తాను ఎలాగైనా బాగా డబ్బు సంపాదించి తన కొడుకుని మాత్రం అంతర్జాతీయ ప్రమాణాలతో అలరారే ఆంగ్ల పాఠశాలలోనే చదివించాలని. తన తండ్రి కూడా బాగా చదివించుకోవాలనే కోరికతోనే 'చదువుల రావ్' అని పేరు పెట్టేసుకున్నాడు. కానీ అది కాస్తా 'చదువులు రావు'గా మారి, చదువు పెద్దగా రానివాడిగానే ఉండిపోయాడు తను. అయినా ఆశ చావక తన కొడుక్కి కూడా 'చదువుల బాబు' అనే పేరు పెట్టుకొని బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలని ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాడు. కానీ తాను పనిచేసేది పక్కా పల్లెటూరు కావడం వల్ల, ప్రభుత్వ పాఠశాల తప్పవు రేదీ లేకపోవడం వల్లా, గతిలేని పరిస్థితుల్లో గవర్నమెంటు స్కూల్లోనే చేర్పించక తప్పలేదు తనయుడిని. అయినా తన కొడుకు మాత్రం తనలాగా కాకుండా, పేరు సార్థకం చేసుకునేలా స్కూల్లో అన్నింటి లోనూ ఫస్ట్ వస్తున్నాడు. దాంతో అందరూ 'తెలివైన కుర్రాడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్చిపాడు చేస్తున్నావం'టూ దెప్పిపొడుస్తుం డడంతో తట్టుకోలేకపోతున్నాడు. ఇప్పుడేమో అదృష్టంకొద్ది సిటీకి ట్రాన్స్‌ఫర్ కావడంతో తన కోరిక తీర్చుకునే ఛాన్సు దొరికినట్టయిం ది. అందుకే అప్పో, సప్పో చేసైనా సరే హై అండ్ హైస్కూల్లోనే అడ్మిషన్ చేయించాలనుకున్నాడు.

అందుకోసమని ఆరా తీయగా, తీయగా 'అట్కిన్సన్ స్కూల్' అగ్రగామిగా తేలడంతో అక్కడే అడ్మిట్ చేద్దామని తీసుకొచ్చేడు. స్కూలు మేనేజిమెంటువారు నిర్వహించిన ప్రవేశ పరీక్షలన్నీ చదువులబాబు చక్కగా పాసవడంతో ప్రవేశం పకడ్బందీ ఫైనల య్యింది. ఇంతలో సాంప్రదాయకమైన చీరకట్టులో ఉన్న ఓ అందమైన అమ్మాయి వచ్చి "హాయ్ సర్" అంటూ గాల్లోకి చెయ్యెత్తి విష్ చేస్తూ, వెల్కం చెప్పడంతో అబ్బా కొడుకులిద్దరూ ఉబ్బితబ్బిబై గాల్లో తేలిపోయారు. ఆమే వారిని లోపలకు తీసుకెళ్లి దగ్గరుండి అన్ని పనులూ చేయించింది.

వారి గౌరవ, మర్యాదలకు ఫిదా అయిన చదువుల్రావు ఇక వెనకా ముందూ ఏమీ ఆలోచించదల్చుకోలేదు. నేరుగా ప్రిన్సిపల్‌ని కలిసి, ఇంగ్లీష్ మాటలు ఒక్క ముక్కా అర్థం కాకపోయినా అన్నిటికీ తలూపి అడిగినంత కట్టేసి, ఆనందంగా బయటికొచ్చేడు. ఆ తర్వాత చదువులబాబు ఎప్పటిలాగే ఆ స్కూల్లోనూ అన్నింటా ఫస్ట్ వస్తుండడంతో చదువుల్రావులో కావాల్సినంత గర్వం కూడా పెరిగి, గొప్పలకు పోతున్నాడిప్పుడు. అది ఎంతదాకా వచ్చిందంటే తన కొడుకు అప్పటివరకూ సాధించిన విజయాలను చూస్తూ వుండబట్టలేక, మార్కుల షీట్స్, ర్యాంకులతో సహా ఫొటోలు తీసి ఫేస్‌బుక్ లో పోస్ట్ చేసేసిండు. అంతటితో ఆగకుండా స్కూలు గొప్పతనాన్ని కూడా డబ్బా కొడు తూ, ఫైవ్‌కు బదులు ఫిఫ్టీ స్టార్స్ ఇవ్వా చ్చని కోసేసేడు. ఆనక అబ్బాయిని ఆశీర్వ దించమని అందరినీ 'అడుక్కోవడం'తో లైకులు కూడా లక్షల్లో వెల్లువెత్తాయి. ఇవన్నీ చూసి ఇంప్రెస్ అయిన మిత్రబృందం ఇంత జరిగాక కూడా తమకు పార్టీ ఇవ్వకపోతే బాగుండదంటూ బలవంతం చేయసాగేరు. చదువుల్రావు తన పుత్రరత్నం టాలెంటును వాళ్లకి చూపడానికి ఇదే సదవకాశంగా భావించేడు.

ఓరోజు ఇంట్లోనే ఘనంగా పార్టీ ఏర్పాటు చేసాడు. పార్టీరోజు కూడా ఓ మూలగా కూర్చొని చదువుకుంటున్న తన 'చదువుబాబు'ని పిలిచి అందరికీ గర్వంగా పరిచయం చేస్తూ ఆశీర్వదించమని కోరేడు. మిత్రులంతా బాబు చదువుల తెలివిని చూసి రకరకాలుగా పొగుడుతూ మెచ్చుకోవ డంతో పొంగిపోయిన చదువుల్రావు ఆనంద భాష్పాలు రాలిపోతుండగా పుత్రోత్సాహం పట్టలేక పుత్రరత్నాన్ని దగ్గరకు తీసుకొని "నువ్విట్లాగే బాగా చదువుకొని పైకి రారా కన్నా" అంటూ ప్రేమగా తల నిమిరేడు.

చదువుల బాబు "అలాగేనని" తలాడిస్తూ వెళ్లి యథాలాపంగా దాన్ని పుస్తకంలో దూర్చేడు.

ఆనక చదువుల్రావు మిత్ర బృందం మేడపై నున్న పెంట్‌హౌస్‌కెళ్లి మస్తుగా మందుపార్టీలో మునిగిపోయారు. పార్టీ ప్రారంభమైన కొద్దిసేపటికే మిత్రబృందమంతా తారాస్థాయిలో తాగి తేలిపోతూ "అబ్బకి చదువబ్బ కపోయినా అబ్బాయికి 'అతికినసన్' లోనే అడ్మిషన్ అతికిందంటే ఆషామాషీ గాదోయ్.. చాలా గ్రేటోయ్" అంటూ ముద్ద ముద్దగా మందు మాటలతో చదువుల్రావుని మత్తెక్కించి మరీ చెట్టెక్కించే స్తున్నారు. అలా మందుపార్టీ మాంచి రసప ట్టులో వుండగా "డాడోయ్... డాడీ" అంటూ పరు గెత్తుకొని పైకొచ్చేడు చదువుల బాబు. ఆ టైంలో పుత్రరత్నం పైకొచ్చి ముందుపార్టీ ని చూడటంతో గతుక్కుమన్నాడు చదువు లా్రవు. వెంటనే తేరుకుని "ఒరేయ్ అప్రా చ్యుడా.. ఈ టైంలో నిన్ను పైకెవరు రమ్మన్నార్రా వెధవా" అంటూ అరిచేదు కోపంగా. చదువుల బాబు తడుముకోకుండా "నువ్వే కదా డాడీ ఇందాక 'బాగా చదువు కొని పైకి రారా' అని చెప్పావు. నేనిప్పటి దాకా బాగా చదువుకున్నాను. ఆ తర్వాతే పైకొచ్చాను. అయినా పైకెందుకొచ్చావంటా రేంటి?" అన్నాడు అమాయకంగా. అంతే! ప్రభుత్వ పాఠశాలలను కాదని ప్రైవేటుకు పోతే పెరిగే టా'లెంటు'ల రుచి తెలిసేసరికి మందుమత్తు దిగిపోయింది. ప్రైవేటులో చెప్పింది చెప్పినట్టు అర్థం చేసుకుని అప్ప గించే సూపర్ ఫాస్టు యంత్రమైన కంప్యూ టర్‌లా తయారు చేయడమంటే ఏమిటో తెలిసొచ్చింది వారికి. అందుకే తండ్రి దీవెనలను ఉన్నదున్నట్టుగా చక్కగా అర్థం చేసుకున్న చదువుబాబు తెలివికి తట్టుకోలేక తాగిన మైకం తొలగి, తల తిరిగి పడిపోయారంతా. ●

# ఎలాంటి స్థలాలు కొనగూడదు?




**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

**3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్**

**సెల్: 9885446501/9885449458**


ఈశాన్యాన్ని తగ్గించే స్థలాలను కొనగూడదు. ఇటువంటి స్థలాలను స్వంతం చేసుకున్నా, ఇల్లు కట్టుకున్నా అభివృద్ధి కుంటుపడుతుంది. వంశాభివృద్ధి క్షయమవుతుంది. దిక్మూఢం ఏర్పడిన స్థలం ఇంటి నిర్మాణానికి పనికిరాదు. మన పొరుగున వున్న స్థలం తూర్పు దిశ నుండిగానీ, ఉత్తర దిశనుండిగానీ వర్షపు నీరు మన స్థలంలోకి పారకుండా జాగ్రత్త పడాలి. వాళ్ల వాడకంనీళ్లు కూడా మన స్థలంలోకి రాకూడదు.

రెండు విశాలమైన స్థలాల మధ్య లభించే ఇరుకైన స్థలాలు మంచి ఫలితాలనివ్వవు. స్థలం ఈశాన్యంగా ఎంత చొచ్చుకుపోతే అంత మంచిదే. కానీ ఇతర మూలల్లో చొచ్చుకుపోయిన స్థలాలు మంచివి కావు. అలాంటి స్థలాన్ని కొనకపోవడం ఉత్తమం. పడమర వాయువ్యం పెరిగిన స్థలం, పడమర నైరుతి పెరిగిన స్థలం, ఉత్తర వాయువ్యం పెరిగిన స్థలం, దక్షిణ నైరుతి పెరిగిన స్థలం, తూర్పు ఆగ్నేయం పెరిగిన స్థలం, దక్షిణ ఆగ్నేయం పెరిగిన స్థలాలు కూడా కొనకపోవడం మంచిది.

మీరు ఎన్నుకున్న స్థలంలో ఇల్లు కట్టుకుంటే ఆ ఇంటి నుండి వీధిలోకి నడిచే మార్గం మిమ్మల్ని తూర్పు, ఉత్తర, ఈశాన్యంలలో ఏ వైపుకు నడిపించినా అది అత్యుత్తమమైన స్థలంగా అనుకోవచ్చు.



ఆ విధంగా కాక తూర్పు ఆగ్నేయానికిగానీ, నైరుతిలో ఏ వైపుకుగానీ, ఉత్తర వాయువ్యానికిగానీ నడుస్తూ వీధిలోకి వెళ్లవలసి వస్తే ఆ స్థలం సరైంది కాదని గమనించండి.

పడమర, దక్షిణ ఆగ్నేయం, పడమర వాయువ్యం గుండా నడుస్తూ వీధిలోకి రావడం కూడా శ్రేష్ఠమైన స్థలానికి సంకేతం. ఇలా ఉత్తమమైన దారులగుండా వీధిలోకి వచ్చే అవకాశం ఉన్న స్థలాలను ఎన్నుకుని గృహ నిర్మాణం చేసుకుంటే తరతరాలు సుఖజీవనం చేయవచ్చు.

## కొనగూడని మరికొన్ని స్థలాలు

**త్రిభుజాకార స్థలం:** మూడు కోణాలు, మూడు భుజాలు కలిగిన స్థలం పనికి రాదు. ఇలాంటి స్థలంలో ఇల్లు కట్టుకొని నివసించేవారుగానీ, వ్యవసాయం, వ్యాపారం చేసేవారుగానీ శత్రుభీతికి లోనవుతూ వుంటారు.

**విషమబాహు స్థలం:** స్థల భుజాలు హెచ్చు తగ్గులు కలిగివున్నా, స్థలానికి నాలుగుకంటే ఎక్కువ మూలలుగానీ భుజాలుగానీ వున్నా, నాలుగు భుజాలే వుండి అవి హెచ్చు తగ్గులుగా వున్నా అటువంటి స్థలాన్ని విషమబాహు స్థలం అంటారు. ఇటువంటి స్థలంలో నివసించే వారు ఆర్థిక ఇబ్బందులు పడుతుంటారు.

**భద్రసనాకార స్థలం:** దీర్ఘ చతురస్రాకారంగా వుండి, నాలుగు దిక్కులను 90లతో ముందుకు పెంచిన స్థలం నాలుగు మూలలను 90 కంటే హెచ్చుతగ్గులు లేకుండా అదిమిపట్టిన స్థలం భద్రాసనాకారంలో కనిపించటం వల్ల దీనిని భద్రసనాకార స్థలం అంటారు. ఇది శ్రేష్ఠమైందే. కానీ నివాస గృహ నిర్మాణాలకు యోగ్యమైంది కాదు.

**దండాకార స్థలం:** స్థలం పొడవు ఎక్కువగా వుండి, వెడల్పు, భుజాలు హెచ్చుతగ్గులుగా వున్న స్థలాన్ని దండాకార స్థలాలంటారు. ఇలాంటి స్థల దుష్ప్రభావం ఎక్కువగా పశువుల ఆరోగ్యంపై చూపిస్తుంది.

**వృత్తాకార స్థలం:** ఇది కూడా విశిష్ఠమైందే. కానీ సాధారణ గృహ నిర్మాణాలకు పనికిరాదు. విశేష కట్టడాలకు మాత్రమే ఉపయోగిస్తుంది. కట్టడాలు వృత్తాకారంలోనే కట్టవలసి ఉంటుంది. వృత్తాకార స్థలంలో చతురస్రాకారంగాగానీ, దీర్ఘ చతురస్రాకారంగా గానీ కట్టడం ఉచితం కాదు.

**చక్రాకార స్థలం:** సంపూర్తి వృత్తాకారం వలె కాక గుండ్రంగా కనిపించే స్వరూపం కలిగిన స్థలాన్ని చక్రాకార స్థలం అంటారు. ఇటువంటి స్థలంలో నివసించే వారు ధననాశనం చేసుకుని క్రమంగా బీదవారుగా మారతారు.

**డమరుక ఆకార స్థలం:** త్రినేత్రుడి చేతిలో వుండే 'డమరుకం' ఆకారంలో ఈ స్థలం వున్నా ఈ స్థలంలో నివసించేవారికి నేత్ర సంబంధమైన జబ్బులు ఎదురవుతాయి.

**అండాకార స్థలం:** కోడిగుడ్డు ఆకారంలోగానీ, తాబేలు చిప్ప ఆకారంలోగానీ కనిపించే స్థలాన్ని అండాకార స్థలం అంటారు. ఇటువంటి స్థలాన్ని కొంటే వదిలించుకోవటం సులభం కాదు. స్థల యజమాని దీన్ని భరించినంత కాలం టెన్షన్ భరించాల్సి ఉంటుంది.

**శకటాకార స్థలం:** బండెక్కి కావలసిన చోటుకి వెళ్లవచ్చు. కానీ బండి ఆకారంలో వున్న స్థలాన్ని కొని, నివసిస్తే ఆ ప్రయాణం దారిద్ర్యం వైపేనని మరువకూడదు.

**కుంభాకార స్థలం:** ఇటువంటి స్థలంలో నివాసమున్నవారికి చర్మ సంబంధమైన వ్యాధులు ఎదురవుతాయి.

**రోకలి ఆకార స్థలం:** ఒకవైపు అర్ధ వృత్తాకారపు స్వరూపం కలిగి పొడవుగా సాగిన స్థలం రోకలి ఆకారంలో కనిపిస్తుంది. ఇటువంటి స్థలంలో వుండేవాళ్లు బంధువులను కోల్పోవటం, సంపదను నాశనం చేసుకోవటం జరుగుతుంటుంది.

**చేట ఆకార స్థలం:** చెరిగే చేటవలె కనిపించే ఈ స్థలాన్ని కలిగివున్నవారు నిరంతర టెన్షన్‌ను కలిగివుండటమే గాక సంపదను కోల్పోతుంటారు.

**అర్ధచంద్రాకార స్థలం:** అర్ధ చంద్రాకార స్థలం వున్నవాళ్లు తరచూ దోపిడి గురించి భయపడుతుంటారు. చోర భయంతో కృశించిపోవటం జరుగుతుంది. గృహ నిర్మాణాలకు చతురస్రాకారం, దీర్ఘ చతురస్రాకారం స్థలాలే అతిశ్రేష్ఠమైనవి. ఈశాన్యం పెరుగుదల కొట్టొచ్చేలా కనిపించటంకోసం వాయువ్య, ఆగ్నేయ మూలల్లో ఎక్కువ స్థలాన్ని వదిలివేయాల్సిన అవసరం లేదు. కొన్ని అంగుళాలు ఈశాన్యాన్ని పెంచుకుంటే చాలు. ■

# నవ సమాజ చైతన్య భావోత్తేజం 'ఉన్నవ'వారి మాలపల్లి నవల

సంస్కృతం నుంచో, ఇంగ్లీషు నుంచో మాటలను అరువుగా తీసుకోవడం మామూలువటం కారణంగా చక్కని తెలుగు మాటలు మూలపడి తెలుగులో సాంకర్యం ఎక్కువయిందని మాలపల్లె లేదా సంగ విజయం నవలా రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ తన నవల పరిచయ వాక్యాలలో సుమారు శతాబ్దం కిందట పేర్కొన్నారు. వీలయినంతవరకు తెలుగు భాష నడకకు అనుకూలంగా వాడుక భాషలో పుస్తకం రాయడానికి నాకిదే మొదటి ప్రయత్నం అంటారు ఉన్నవ.




ఆనాటి కాలమాన పరిస్థితులలో ఆంధ్ర పత్రిక వ్యవస్థాపకుడు కాశీనాథుని నాగేశ్వరరావు, భావ ప్రకటనకు తగిన తెలుగు జాతీయ పదాలు భాషలో లేకపోవడమే సంస్కృత పదాలను వాడుటకు కారణమని మాలపల్లి గ్రంథావలోకనం వెల్లడి చేస్తోందని తన అభిప్రాయం తొలి పలుకులలో వ్యక్తం చేసారు.

నవలలో ఉపయోగించిన భాష వాడుక భాష అయినా, గ్రాంథిక భాషా సంస్కారాన్ని, గ్రాంథిక పరిణామ గౌరవపాత్రంగా ఉందని అంటారు. ఉత్తమ కావ్యం అంటూ మాలపల్లిని ప్రశంసిస్తూనే ఈ గ్రంథం ఒక పురాణం అయిందనీ, కావ్యాలలో పద్యాలకు గల గౌరవం గద్యాలకు లేదని, ప్రాచీన మార్గానికి గల ఆదరణ నవీన మార్గాలకు దుర్లభమని, గ్రాంథిక భాషకు గల ప్రతిష్ఠ వాడుక భాషకు లేదని సాక్షాత్తు ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య సమరయోధుడు కాశీనాథుని నాగేశ్వరరావు గారి అభిప్రాయం కావటం నాటి గ్రాంథిక భాషకు వున్న పలుకుబడి, ప్రాభవం స్పష్టమవుతున్నాయి. ప్రజాదరణమును బడసిన తత్త్వములు, కీర్తనలు మానవ ధర్మ పరిణామమునకును, తెనుగు మాధుర్యమున నిదర్శనములు. తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు సాహిత్యము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము మాలపల్లికి అనిర్వచనీయమైన ప్రతిభను సమకూర్చాయి. రసాత్మకమైన వాక్యము కావ్యమను నిర్వచనం మాలపల్లికి సార్థకంగా ఉంది అని కూడా 'కాశీనాథుని' పేర్కొన్నారు.

మహాత్మాగాంధీ రాజకీయ రంగ ప్రవేశం నాటి సాంఘిక పరిస్థితుల తీవ్ర పరిణామాలకు మాలపల్లి అద్దం పట్టింది. 1920లో గాంధీజీ అహింసాయుత సహాయ నిరాకరణోద్యమం అస్వతంత్ర భారత జాతిని కదిలించింది. ఆటుపోటు సాగిన నాటి అసహాయోద్యమ ఇతివృత్తం ఈ నవలలో రచయిత ప్రతిబింబింప చేసారు. మాలదాసరి కులస్థుడయిన రామదాసు కుటుంబంతో కలిసి మాలపల్లి కార్యస్థానంగా నిష్కామ కర్మయోగిగా ధర్మ విజయం సాధిస్తాడు. రామదాసు, మహాలక్ష్మమ్మ, లక్ష్మమ్మ, రామానాయుడు, సంగదాసు, వెంకటదాసు, అప్పాదాసు, చౌదరయ్య, వెంకటయ్య, కమల, మోహనరావు పంతులు, పౌలు, ఫాదరీలు అన్ని పాత్రలు నాటి సమాజ తీరుతెన్నుల మార్పుకోసం భాగస్వామ్యం అవటం ఈ కథా సంవిధానంగా సాగుతుంది.

నాటి ఆర్థిక వ్యవస్థలో సంపన్నులయిన భూస్వామ్య వర్గాలు శ్రామికులను, పేదలను పీడించడానికి బ్రిటిష్ పోలీసులు, చట్టాలు అధికార వ్యవస్థకు ఏ విధంగా సహకరిస్తున్నదీ ఈ కథా కావ్యం తెలియచేస్తుంది. అదేవిధంగా ధర్మాత్ములయిన సంపన్నులు సంఘాభివృద్ధికి, సమాజ కల్యాణానికి ఏ విధంగా నిస్వార్థంగా దోహదం చేయగలరో కథ స్పష్టం చేస్తుంది. జోతి అప్పాదాసుల నిష్కల్మష ప్రేమ, మోహనరావు కమలల అనైతిక బాంధవ్యం కథలో అంతర్భాగం. సంగదాసు నిరుపేదలైన వ్యవసాయ కూలీలను రష్యా చూపించే బాటగా సంఘాలుగా సమ్మెలతో, గాంధేయ సహాయ నిరాకరణ ఉద్యమ బాటలో, మాల మాదిగలు హక్కుల సాధన కోసం ధర్మపోరాటాలు చేయాలని ఉద్బోధిస్తాడు. అస్పృశ్యత, భూస్వామ్య దోపిడీని నిరుపేదలైన మాలమాదిగ కులస్థులు శాంతియుత తిరుగుబాటుతో ఎదుర్కోవాలని మాలపల్లె పిలుపు యిస్తుంది. దీనులు, దళితులు, నిరుపేదల వేదనాయుత జీవన సంఘర్షణను 762 పేజీల కథా ఇతివృత్తంగా గాంధేయవాద అహింసాయుత పోరాట లక్ష్యంతో స్వాతంత్ర్య పోరాటం యింకా మరింత ఊపు అందుకోని దశలో ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన ఈ రచన భాషా పరంగానూ, స్వరాజ్య భావోత్తేజంగానూ నాడు తిరుగుబాటు సృష్టించింది.

తెలుగు వ్యావహారిక భాషా వికాసాన్ని పరిశీలిస్తే నీతిచంద్రిక, విక్రమార్కుని కథలు, పంచతంత్రం, కాశీమజిలీలు వంటి గ్రామ్య గ్రంథాల స్థాయి నుంచి కందుకూరి వీరేశలింగం ఆంధ్ర వాఙ్మయాభివృద్ధితో పాటు సంఘ సంస్కరణాభిలాషతో నవలలు, నాటకాలు, కథలు, జీవిత చరిత్రలు, వ్యాసాలు, ప్రహసనాలు, గ్రంథ విమర్శనములు, శాస్త్రం, చారిత్రక గ్రంథాలు, వార్తా పత్రికలు సరళ ప్రసన్నమైన గ్రాంథిక శైలికి ఆద్యులయ్యారు. 20 సంవత్సరాల తరువాత మహాకవి గురజాడ 1892 ఆగస్టులో రంగస్థలంపై 'కన్యాశుల్కం' ప్రదర్శించినట్లు తెలుగు హార్పు అనే పేరుగల పత్రిక వల్ల తెలుస్తోంది. నాటి సమాజంలోని దురాచారాలపై, సంస్కరణయుతంగా భాషను ఆయుధంగా బాల్య వివాహాలు, సతీసహగమనం, వేశ్యావృత్తి, అవినీతి, మహిళల ఘోర అణచివేత, అన్యాయ, అక్రమ దురాచారాలపై పోరాటం ఆరంభమైంది. క్రమేపీ జాతి సంస్కృతి, జాతీయత, గౌరవ ప్రతిష్ఠల ఆర్థిక జీవనం, భూస్వామ్య వ్యవస్థపై, స్వాతంత్ర్య కాంక్ష, స్వరాజ్య ఉద్యమాలపై రచనలు వెల్లువెత్తాయి. 19వ శతాబ్దపు ఆఖరి దశలో నూతన యుగావిష్కరణ ఆరంభమై, 20వ శతాబ్దపు ప్రారంభంలో బ్రహ్మ సమాజం, సమాజంలో పాతుకుపోయిన మూఢ విశ్వాసాలు, అవినీతి, వ్యభిచారం, అస్పృశ్యత, ఛాందస జీవనంపై పోరాటం కొనసాగింది. ఉన్నవ లక్ష్మీనారాయణగారి మాలపల్లి నాటి దేశమాన కాల పరిస్థితులకు అద్దం పట్టే సాహసిక రచనగా వెలుగు చూసింది. తెలుగునాట గాంధేయ ఆశయ చైతన్య భావోత్తేజం ప్రసరింపచేసి బ్రిటిష్ ప్రభుత్వ ఆగ్రహానికి గురి అయింది.

**- జయసూర్య**



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



అనుకోని సంఘటనలు జరిగినా మనోధైర్యంతో ఎదుర్కొంటారు. చిరు వ్యాపారులకు పోటీ అధికం. కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు ఉంటాయి. ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది. స్త్రీలకు ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. వృత్తి విద్యా కోర్సులు అభ్యసించిన ఆర్థికంగా బాగుంటుంది.

## వృషభం



శత్రువులు మిత్రులవుతారు. సంతానాభివృద్ధి ఆనందం కలిగిస్తుంది. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. నూతన వ్యక్తులతో పరిచయం. ఊహించని వార్తలు వింటారు. ఏది జరిగినా మన మంచికే.. అని సరిపెట్టుకునే మనస్తత్వం అలవడుతుంది. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభిస్తారు.

## మిథునం



వివాదాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. వ్యవసాయ భూమి కొనుగోలు చేస్తారు. ఉద్యోగులకు పని వత్తిడి అధికం. వృధా కాలక్షేపం మంచిది కాదు. అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వానుభవంతో తెలుసుకుంటారు. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. శుభ కార్యాలకు హాజరవుతారు.

## కర్కాటం



వృద్ధుల ఆరోగ్యం మెరుగవుతుంది. చోర భయం పొంచి వుంది కనుక విలువైన పత్రాలు, వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. స్త్రీలు స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు. అన్ని వ్యవహారాల్లో మీదే పైచేయిగా ఉంటుంది. చిరు వ్యాపారులకు బాగుంటుంది. ధర్మ రక్షణకై పాటుపడతారు. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. వాహన యోగం.

## సింహం



స్వగృహ కోరిక నెరవేరుతుంది. కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఆహ్వానం అందుకుంటారు. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. దూర ప్రాంత ప్రయాణం చేస్తారు. వివాహాది శుభ కార్యాలకు హాజరవుతారు. తాహతుకు మించిన రుణాలు చేయక పోవడం మంచిది. వృత్తి రంగాల్లో వున్నవారికి పోటీ ఉంటుంది.

## కన్య



వృధా ఖర్చులను తగ్గించుకుంటారు. ధార్మిక చింతన అలవడుతుంది. ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. భూ తగాదాలు తీరి లబ్ధి పొందుతారు. తీర్థ యాత్రలు చేస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. గృహ యోగం.

## తుల



సాహస యాత్రలు చేస్తారు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు పెద్దల సలహాలు, సూచనలు పాటించండి. భాగస్వామ్య వ్యాపారుల సమస్యలు పరిష్కారమవుతాయి. వాక్చాతుర్యంతో ముఖ్యమైన పనులు చక్కబెట్టుకుంటారు. సాహిత్య సభలు, సమావేశాలకు హాజరవుతారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం అందుకుంటారు. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. సంయమనం పాటించండి.

## వృశ్చికం



పేరు ప్రఖ్యాతులు లభిస్తాయి. దీర్ఘకాలిక రుణాలు తీర్చి ఊరట పొందుతారు. కుటుంబంలో స్వల్ప వివాదాలకు ఆస్కారం. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. వివాహాది శుభ కార్యాలకు హాజరవుతారు. వ్యాపారులకు బ్యాంకు రుణాలు మంజూరవుతాయి. దేశాంతర ప్రయాణం చేస్తారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం శ్రేయస్కరం.

## ధనుస్సు



క్రీడాకారులకు బాగుంటుంది. వివాదాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. విదేశీ ప్రయాణ సూచనలు అధికం. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. సొంతింటి స్వప్నం సాకారమవుతుంది. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. అనారోగ్య సమస్యలను అలక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. చర్చలు వాయిదా.

## మకరం



ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. తీర్థ యాత్రలు చేస్తారు. వస్తువుల కొనుగోలు-అమ్మకం వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. వృధా సంచారం మంచిది కాదు. సోమరితనం దరి చేరనివ్వకండి. ఎదురు చూస్తున్న శుభ సమాచారం వారాంతంలో అందుకుంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి సామాన్యం.

## కుంభం



ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి, సంయమనంతో వ్యవహరించండి. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. కింది స్థాయి ఉద్యోగులతో మాట్లాడేటప్పుడు సహనంతో ప్రవర్తించండి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది.

## మీనం



కళాకారులకు సన్మాన యోగం. విద్యార్థులకు శుభ యోగం. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. దేశాంతర ప్రయాణం చేస్తారు. ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబంలో మనస్పర్థలకు ఆస్కారం. గొప్పలకు పోయి తాహతుకు మించిన రుణాలు చేయకండి. హోల్ సేల్ వ్యాపారులకు లాభదాయకం.

# సరదాగా కాసేపు నవ్వుకోండి



## నాకూ తెలియదు

చింటూ, బంటూ పద్యాలు కంఠతా పడుతున్నారు.
"అప్పిచ్చువాడు వైద్యుడు" అంటే ఏంటిరా?" అడిగాడు బంటి, చింటూను.
"అప్పు ఇచ్చి వైద్యం చేసేవాడేమోరా! నాకూ తెలియదు" అన్నాడు చింటూ.

## క్షణంలో ఆర్పేస్తాను

"అప్పు నిప్పు లాంటిది కాల్చేస్తుంది" తన మిత్రుణ్ణి హెచ్చరించాడు ఒకతను.
"పరవాలేదు.. నా డ్యూటీ ఫైర్ స్టేషన్‌లో. ఎంతటి నిప్పునైనా ఆర్పేస్తాను" ధీమాగా చెప్పాడు, అప్పడిగిన మిత్రుడు.

**- టి.సదాశివ రెడ్డి,** తిరుపతి

## ఆన్‌లైన్‌లోనే...

"ఫలానా వస్తువు కావాలని ఆన్‌లైన్‌లో చూసి, ఆన్‌లైన్‌లోనే డబ్బు కట్టాను. ఇంకా రాలేదేమిటో?" అన్నాడు



వెంగళ్రావ్.
"బహుశా ఇంకా ఆన్‌లైన్‌లోనే ఉందేమో!" జవాబిచ్చాడు అప్పారావు.

## ఓల్డ్ మాడల్

"నా పెళ్లిని యూట్యూబ్‌లో పెట్టాను" అన్నాడు, రంగారావు.
"అది చాలా ఓల్డ్ పద్ధతి. నా పెళ్లిని ఓటిటిలో రిలీజ్ చేసాను" అన్నాడు కోతలరాయుడు.

## సెల్‌ఫోన్‌లో భగవద్గీత

"భగవద్గీత మీద ప్రమాణం చేయమంటే సెల్‌ఫోన్ మీద ప్రమాణం చేస్తున్నావేంటయ్యా?" ప్రశ్నించాడు జడ్జి.
"ఇందులో డౌన్‌లోడ్ చేసిన భగవద్గీత ఉందండి" చెప్పాడు మూర్తి.



## నో డేటా..



"రోడ్డు మధ్యలో కారు ఆపేసారు, ఏమైందండీ?" అడిగింది భర్తను రాణి.
"సమయానికి డేటా లిమిట్ దాటిపోయి గూగుల్ మ్యాప్ దారి చూపించడం మానేసింది" అన్నాడు, వజ్రీరావ్.

## మార్పులు

"గూగుల్ మ్యాప్‌లో ఇంకా మార్పులు రావాలా్రా" అన్నాడు, నవీన్.
"ఏవిధంగా?" అడిగాడు, పవన్.
"రోడ్ల మీదున్న ట్రాఫిక్‌ను చూపిస్తున్నట్టుగా వానా కాలంలో రోడ్లపై ప్రవహిస్తున్న వాననీళ్ల నదుల గురించి హెచ్చరిస్తే మరో రూట్లో వెళతారంతా" అన్నాడు నవీన్.

## పెద్దలు సైతం..

"పెద్దవాళ్లు కూడా ఇప్పుడు పిల్లలైపోతున్నారు" ఆరేళ్ల మస్తక్ అన్నాడు చిరాగ్గా.
"ఎందుకలా అంటున్నావు?" అడిగాడు కార్తిక్.
"పెట్రోల్ బండ్లు వదిలి మన మాదిరి బ్యాటరీ బండ్ల మీద తిరుగుతున్నారు".

## చర్చా కార్యక్రమం

"టెక్నాలజీ మనిషిని- మనిషిని దూరం చేస్తోంది" అన్నాడు భర్త.
"సంతోషం.. ఇప్పటికైనా గ్రహించారు" అంది భార్య.
"ఆగాగు.. ఇది జరిగింది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా".

**- ప్రతాప వెంకట సుబ్బారాయుడు**

## జోక్స్‌కు ఆహ్వానం

మీరు పంపే జోక్స్ హాస్యాన్ని పండించేలా ఉండాలి.
కాపీ జోక్స్‌ను పంపకండి. చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com

# తెలుగు సినిమాకు ఓ బంగారు దీపం.. బాలకృష్ణ



**చిత్రభారతి**

**వాశిరాజు ప్రకాశం**

'తెలుగు సినిమా'.. ఒక్క మాటలో చెప్పాలంటే అందమైన నందన వనం. రకరకాల పువ్వులతో సుగంధాలు విరజిమ్మటం, ప్రేక్షకులను ఆనంద డోలికల్లో విహరింపచేయటం 75 సంవత్సరాల సినిమాకు దేవుడిచ్చిన వరం.

1913 నాటి హెచ్.ఎం.రెడ్డి గారి 'భక్తప్రహ్లాద' నుండి ఈనాటి వరకు ప్రేక్షకులకు వినోదాన్ని పంచిన తెలుగు సినిమాల్లో చీకటి కోణాలు పెద్దగా లేవు.



తెలుగు నిర్మాతలు ఈ వ్యాపారాన్ని గౌరవంతో సాగించారు కనుకనే ఏటా తెలుగు సినిమాల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఏదేమైనా యింకా పెరుగుతుంది. ఈ అనంత పయనంలో కళాకారులు, టెక్నీషియన్లు తమ ప్రతిభకు పట్టాభిషేకం చేసుకుంటూనే వున్నారు. తెలుగు సినిమా స్థాయిని, హోదాను పెంచి పెద్ద చేస్తున్నారు. సినిమా అనేది నవరసాల పంట అన్న సత్యాన్ని ఏభై సంవత్సరాల అద్భుతం 'ఖైదీ' నుండి నేటి 'ఆచార్య' వరకు అక్షరాలా నిరూపించారు. ఈ నిచ్చెనమెట్లు ఆదర్శవంతం.. పెరుగుతున్న నవ రూపంలో కళాకారులు ప్రతిభను నిండుదోసిళ్లతో ధారపోశారు. ఈ ధారావాహిక వరద కొనసాగుతూనే ఉంది. ఈ పయనంలో నందమూరి బాలకృష్ణ ఆకాశ వీధులను అందుకునే ప్రయత్న చేస్తున్నట్లు ఆయన నటించిన, తాజాగా నటిస్తున్న చిత్రాలు తెలియచేస్తున్నాయి. ఇలాంటి ఆశయంతో ఒక పవిత్ర లక్ష్యంతో సినిమా నిర్మాణం కోసం కర్నూలు పట్టణానికి చేరి, అక్కడి చారిత్రక అందాలను కెమెరాలో భద్రం చేసుకునే ప్రయత్నం మైత్రీ మూవీ మేకర్స్ వారి చిత్రం ఎన్‌బికె 107వ వర్కింగ్ టైటిల్ యిప్పటికే బాలకృష్ణ అభిమానులను కంటికి నిద్ర రానంత స్థాయిలో కలవరపెడుతుంది.


బాలకృష్ణ ప్రతి సినిమా విభిన్నంగా వుండాలన్న ఆశతో ఆయన గొప్పగా కృషి చేస్తున్నట్లు అలనాటి సాంఘికాల నుండి నేటి రౌద్ర రూపాల వరకు నిరూపిస్తున్నాయి. తాను కేవలం ఒక నటుడు మాత్రమే కాదు, తన హృదయాంతరాలలో దాచుకున్న ప్రతిభాసాగరం అని ఆయన నిరూపించుకున్న చిత్రాలే వుదాహరణలు. అలాంటి ఈ మైత్రీ మూవీ మేకర్స్ చిత్రాల్లో లొకేషన్స్ కొత్తగా వుండాలన్న ఆకాంక్షతో మైత్రీ మూవీ మేకర్స్ కర్నూలుదాకా వెళ్లటానికి కారణం. అక్కడ టూరిస్టులను ఆకట్టుకున్న కొండారెడ్డి బురుజు.. కర్నూలు పట్టణానికి ఇది చారిత్రాత్మక చిహ్నం. ఇక హీరోయిన్... శృతిహాసన్.. కమల్‌హాసన్ వంశీయులు కనుక ప్రతిభను పిలిస్తే పలుకుతుంది. ఇంకా కొత్తగా వుండాలన్న లక్ష్యంతో కన్నడ స్టార్ దునియా విజయ్, వరలక్ష్మీ విజయకుమార్ నవ్యమైన పాత్రలు పోషిస్తూ, తమ ప్రతిభను కన్నడతో పాటు యితర భాషలకు విస్తరింపచేయటంతో నిర్మాతలు స్క్రిప్టు మీద ప్రత్యేక శ్రద్ధ వహించటం వారు చేస్తున్న కృషికి తార్కాణం. మ్యూజిక్ మాస్టర్ థమన్ ఆశలు పూయిస్తున్నారు. ఫొటోగ్రఫీ మరో ప్లస్ పాయింట్. మరో గ్లామర్ హీరోయిన్ను నటసింహానికి తోడుగా, చిలిపినవ్వుల తారగా అందిస్తారని సినిమా వర్గాల తాజా కథనం. మొత్తానికి సినిమా అనేది భారీ ఖర్చుతో కూడిన అంశమే అయినా దాని ఫలితాలు భారీ ఎత్తున కనకవర్షం కురవాలంటే, ముందస్తుగా చేసే హోంవర్క్ చాలా అవసరమన్న సిద్ధాంతాన్ని దర్శకుడు మలినేని గోపీచంద్ మనసు నేర్చిన వ్యాకరణం.

బాలకృష్ణకు తెలుగు సినిమాలో అద్భుతమైన స్థానం వుంది. తండ్రిగారి అడుగుల్లో అడుగు వేసి నటనకు తండ్రే గురువు అని విశ్వసించారు కనుకనే బాలకృష్ణ అపజయం తెలియక స్టార్ వాల్యూతో వేగంతో సాగుతున్నారు. ఇలాంటి కళాకారులు అందించే విజయాలు యావత్ సినిమా హర్షించి, కనకాభిషేకం చేస్తోంది కనుకనే బాలకృష్ణ ఏ కథలో నటించినా ఆడినా, పాడినా, శృంగారం ఒలకబోసినా అది ఒక ఆనంద వింత లోకం. ఒక్కసారి చరిత్రలోకి వెళ్లి మచ్చుకు రెండు సినిమాలు గుర్తు చేసుకుందాం:


భార్గవ ఆర్ట్స్ తొలి దశ చిత్రంలో ఆయనతో పాటు సుహాసిని నటించి 'దంచవే మేనత్త కూతురా' పాటతో అభిమానుల హృదయాలను దోచుకున్నారు. స్వతహాగా కెమెరా వుమెన్ అయిన సుహాసిని నటిగా మారి, వెండి తెర మీద ఆశ్చర్యాలను చిత్రీకరించారు.

అలాగే 'ముద్దుల కృష్ణయ్య' చిత్రంలో విజయశాంతితో బాలకృష్ణ నటించిన ఆ కథ, కథనం యిప్పటికీ మరిచిపోలేం. ఒక సన్నివేశంలో బాలకృష్ణ ఒంటరివాడై యింటికి వచ్చేసరికి కమ్మని చేపల పులుసు తయారుచేసి పెట్టిన విజయశాంతిని చూసి ఆయన ఆశ్చర్యపోతారు ఎవరీ అమ్మాయి? అనుకుంటూ. కథ జరిగినకొద్దీ ఎన్నో సంగతులు తెలుస్తాయి. సమీప నగరంలో నటిగా వున్న విజయశాంతి విశ్రాంతి కోసం బాలకృష్ణ పర్ణశాలకు రావటం అందరికీ ఆశ్చర్యమే. అయినా ఆ యిద్దరూ సినిమా ఆసాంతం ఒకరికొకరు దూరంగా వుండటం జరిగినా నవ్య శృంగారానికి ఈ చిత్రం వెన్నెలజల్లు కురిపిస్తుంది. ఇలాంటి చిత్రాలు నిర్మాతకు కనకవర్షం కురిపిస్తాయి. ఆ తరువాత కథ ఒక విషాదం. నిజ జీవితంలో నిర్మాత చనిపోతారు. కారణాలు అనేకం. అవన్నీ చెప్పుకోలేం, మనసు ద్రవిస్తుంది. కళ్ల చెమరుస్తాయి.. అదే జీవితం.. అదే విధిరాత. ●

ఈ వా రం కా ర్టూ న్స్


అన్నిటిలాగే.. 'హ్యాపీ మరదళ్ళ డే' కూడా ఉందేమోని..
మా మరదళ్లకు కాల్ చేసి విష్ చేసానంతే...!!
Zakir...


ముందు గతుకులు లేని రోడ్డున్నది.. జాగ్రత్త..!!
TS08 XXX
Zakir...


రోగమేమీ లేదు... నాలుగు రోజులు ఐసీయూలో ఉంచి పంపించేస్తాం... లేకుంటే మా హాస్పిటల్ పరువు పోద్ది...!!
Zakir...



ఫోటో ఫీచర్

పర్యాటక ప్రాంతంగా మారిన ఈ జామ పండ్ల మార్కెట్ బంగ్లాదేశ్‌లో ఉంది. ఇది నీటిపై తేలుతుంటుంది. నదీ పరీవాహక ప్రాంతాల్లో జామతోటలను సాగు చేస్తారిక్కడ. ప్రతిరోజు కొన్ని లక్షల వ్యాపారం జరుగుతుంది. రైతులు నాటుపడవలతో వెళ్లి ఎవరి పొలం సరిహద్దులో వాళ్ల జామకాయలు కోసుకొచ్చి అక్కడే అమ్ముకుంటారు. చుట్టుపక్కల గ్రామాల వారికి ఈ తోటలే జీవనాధారం. జామకాయలతో నిండుగా వుండే పడవలు, నీటిపైనే జరిగే బేరసారాలు కళ్లారా చూడాల్సిందే తప్ప మాటల్లో చెప్పనలవి కాదు సుమా!







